ప్రజాశక్తి
గురువారం 1 ఆగస్టు 2024 8 పేజీలు
గుంటూరు పల్నాడు





ముమ్మరంగా ఖరీఫ్

- పెరగనున్న మిర్చి సాగు
- సాగర్‌కు నీటి రాకతో చిగురించిన ఆశలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షాలు ఆశాజనకంగా ఉండటం, నాగార్జున సాగర్ జలాశయానికి నీరు వస్తుండటంతో ఈ ఏడాది మిర్చి సాగు పెరగనుంది. ఈ ఏడాది దాదాపుగా నీటి ఎద్దడి ఉండకపోవచ్చన్న భావనతో రైతులు మిర్చి సాగుకు మొగ్గుచూపుతున్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గతేడాది 1.40 లక్షల ఎకరాల్లో మిర్చి సాగవగా ఈ ఏడాది 1.80 లక్షల ఎకరాల్లో సాగువుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం మిర్చి ధర కొంత తక్కువగా ఉన్నా కనీస ధర రూ.10 వేలుకు తగ్గకపోవడం వల్ల ఎంతో కొంత శ్రమించి సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. పెట్టుబడికి నష్టం జరగకుండా మంచి ధరలు వచ్చే అవకాశం ఉండటంతో రైతులు మిర్చి వైపే మొగ్గుచూపనున్నారని చెబుతున్నారు.

గతేడాది సాగర్ జలాశయానికి ఎగువ నుంచి నీరు రాకపోవడం వల్ల చివరి దశలో ఇబ్బంది ఏర్పడింది. దిగుబడి కూడా గణనీయంగా తగ్గింది. ఈసారి సాగర్ జలాశయం నిండితే దాదాపుగా రెండుమూడు తడులకు ఇబ్బంది లేకుండా నీరు వస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం నీటి ఎద్దడి దాదాపుగా తొలగినట్టేనని రైతులు ఆశపడుతున్నారు. పల్నాడు జిల్లాలో 2.75 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు లక్ష ఎకరాల్లో వేశారు. సాగర్ ఆయకట్టు పరిధిలో పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు, గుంటూరు జిల్లాలోని రెండు నియోజకవర్గాలలో ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. గతేడాది కూడా సరి అయిన వర్షాలు లేక, సాగర్ నుంచి నీరు రాక వరి సాగవ్వలేదు. బోర్లు కింద నామమాత్రంగా సాగు చేశారు. పల్నాడు జిల్లాలో 1.06లక్షల ఎకరాలలో వరి సాగు చేయాల్సి ఉండగా ఇంత వరకు సాగర్ కాల్వలకు నీరు విడుదల కాకపోవడంతో వరి సాగు ప్రారంభం కాలేదు. తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో 20 వేల ఎకరాల్లో సాగర్ పరిధిలో వరి సాగు చేయాల్సి ఉంది.

నాగార్జున సాగర్ ఆయకట్టుపరిధిలో వరి సాగుకు గతేడాదికూడా అనుమతి ఇవ్వలేదు. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని గుంటూరు జిల్లాకు సంబంధించి పొన్నూరు, మంగళగిరి, తెనాలి నియోజకవర్గాల్లోని కాల్వలకు ప్రస్తుతం పట్టిసీమ నీరు రావడం వల్ల వరి సాగు ఊపందుకుంది. దాదాపు 80 వేల ఎకరాల్లో వరి వెదపద్ధతిలోసాగు చేయగా మరో 20 వేల ఎకరాల్లో నాట్లు పద్ధతిలో సాగు చేశారు. మొత్తం 1.64 లక్షల ఎకరాలకు గాను లక్ష ఎకరాల్లో సాగు పూర్తయింది. విస్తారంగా వర్షాలు కురవడం, కాల్వలకు నీరు రావడం వల్ల రైతులు వ్యవసాయం వైపు పరుగులు పెడుతున్నారు. జిల్లాలో 68 వేల ఎకరాల్లో పత్తి సాగు అవుతుందని అంచనా వేయగా 30 వేల ఎకరాల్లో సాగు చేశారు. 52 వేల ఎకరాల్లో మిర్చి సాగవుతుందని అంచనా వేయగా ఇప్పటి వరకు 2 వేల ఎకరాల్లోనే మిర్చి వేశారు. మినుము, పెసర, పసుపు తదితర పంటలు మొత్తంగా 10 వేల ఎకరాల్లో సాగయ్యాయి.



ఒక్క రోజులో 10 అడుగులు పెరిగిన సాగర్ నీటి మట్టం

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : నాగార్జునసాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వచ్చే ఇన్ ఫ్లో పెరగటంతో ఒక్క రోజులో 10 అడుగుల మేర నీటిమట్టం పెరిగింది. బుధవారం సాయంత్రం 7 గంటలకు సాగర్ జలాశయ నీటిమట్టం 527.20 అడుగులకు చేరింది. ఇది 162.7328 టీఎంసీలకు సమానం. శ్రీశైలం జలాశయం నుంచి 8 క్రస్ట్ గేట్ల ద్వారా 2 లక్షల 23 వేల 768 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన అనంతరం మొదటి పవర్ హౌస్ ద్వారా 24,917 క్యూసెక్కులు, రెండవ పవర్ హౌస్ ద్వారా 35,315 క్యూసెక్కులు, మొత్తం 2,84,000 క్యూసెక్కులు సాగర్‌కు వస్తోంది. ఇన్ ఫ్లో ఇలాగే కొనసాగితే మరో వారం రోజుల్లో సాగర్ జలాశయ నీటిమట్టం గరిష్ట స్థాయిలో 590 అడుగులకు చేరుకునే అవకాశాలు ఉన్నాయి.



గుండ్లకమ్మ నదిని పరిశీలిస్తున్న సందర్భంలో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి రామానాయుడు

గుండ్లకమ్మపై చెక్‌డ్యామ్ నిర్మిస్తాం

- ప్రజల అవసరాల దృష్ట్యా కుడికాల్వకు నీటి విడుదల కొనసాగింపు
- నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి-వినుకొండ

గుండ్లకమ్మ నదిపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. బుధవారం శ్రీశైలం వెళ్లి వస్తున్న మంత్రిని మండలంలోని చీకటిగలపాలెం అడ్డరోడ్డు వద్ద ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో రైతులు కలిసి పలు సమస్యలను వివరించగా గుండ్లకమ్మ నదిని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పల్నాడు జిల్లా ప్రజలు దాహార్తిని తీర్చాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తమ దృష్టికి తేగానే కృష్ణా రివర్ బోర్డుతో చర్చించి కుడికాల్వకు 5 టీఎంసీల నీటిని విడుదల చేయించామని, దీనిపై మళ్లీ సమీక్షించామని, కృష్ణాడెల్టా, కుడికాల్వ పరిధిలో అవసరాలకు ప్రాధాన్యమిచ్చి నీటి విడుదలను కొనసాగిస్తున్నామని చెప్పారు. ఇదిలా ఉండగా జీవీ ఆంజనేయులు పలు అంశాలను మంత్రి దృష్టికి తెచ్చారు. గుండ్లకమ్మ వాగుకు, ఈపూరు చెరువుకు నాగార్జునసాగర్ మెయిన్ కెనాల్ నుండి నీటి విడుదల కోసం తూము ఏర్పాటుకు అనుమతివ్వాలన్నారు. గతంలో వినకొండ మండలం కనుముల చెరువు, పెద్ద కంచర్ల చెరువులకు ఏ విధంగా ఎన్ఎస్‌పి నుండి తూము అనుమతిచ్చారో అదేవిధంగా అనుమతులివ్వాలని కోరారు. గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంలో అనేక గ్రామాల రక్షితనీటి పథకాలు, గిరిజన రెషిడెన్షియల్ పాఠశాలలకు నీటిపథకాలు ఉన్నాయని, వేసవిలో గుండ్లకమ్మ ఎండిపోయి తాగునీటికి ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. 36 కిలోమీటర్లున్న గుండ్లకమ్మ నదిపై చెక్‌డామ్‌లు నిర్మించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. అంచనాల రూపొందించాలని ఎన్ఎస్‌పి అధికారులను ఆదేశించారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, టిడిపి నాయకులు, అధికారులు ఉన్నారు.

భారీగా డిఎస్‌పిల బదిలీ

నలుగురు డిఎస్‌పిలకు పోస్టింగ్ నిల్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల బదిలీ ప్రక్రియను పూర్తి చేసిన ప్రభుత్వం తాజాగా డిఎస్‌పిలను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. పలువురు డిఎస్‌పిలకు పోస్టింగ్ ఇవ్వకుండా పోలీసు రాష్ట్ర కార్యాలయం (డిజిపి)లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. డిసిఆర్‌బి డిఎస్‌పి పి.శ్రీనివాసరావును కాశీబుగ్గకు, గుంటూరు ట్రాఫిక్ డిఎస్‌పి వి.వి.నాయుడ్ని విజయవాడ ట్రాఫిక్ ఎసిపిగా, విజయవాడ ట్రాఫిక్ ఎసిపి బి.జనార్ధనరావును తెనాలికి బదిలీ చేశారు. తెనాలిలో ఉన్న ఎం.రమేష్‌ను డిజిపి కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. సిఐడి డిఎస్‌పిగా ఉన్న వి.మల్లికార్జునరావును విజయవాడ దిశ స్టేషన్‌కు బదిలీ ▶ 2లో

22 మంది సిఐల బదిలీ

పిన్నెల్లికి మరోసారి బెయిల్ నిరాకరణ 2వ పేజీ



పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తున్న గుంటూరు కలెక్టర్

ఎయిమ్స్‌లో పనులు సత్వరం పూర్తి చేయాలి

ప్రజాశక్తి -మంగళగిరి

స్థానిక ఎయిమ్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరుపున కల్పించాల్సిన మౌలిక సౌకర్యాల పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. ఎయిమ్స్ డైరక్టర్, సీఈఓ ప్రొఫెసర్ మధభానందకర్, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్‌తో కలసి అధికారులతో ఎయిమ్స పరిపాలన భవనంలో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. ఎయిమ్స్‌కు 4 ఎంఎల్‌డి నీటి పైపులైను పనులు, ఎయిమ్స్ విస్తరణకు స్థలాల కేటాయింపు, మంగళగిరి వైపు రహదారి విస్తరణకు, పైపులైను ఏర్పాటుకు అటవీశాఖ అనుమతులు, స్టామ్ వాటర్ డ్రైయిన్ల నిర్మాణం, ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా, ఎయిమ్స్‌కు సిహెచ్‌సి, పిహెచ్‌సిల బదలాయింపు తదితర పెండింగ్ అంశాలను ఎయిమ్స్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పైపు లైను పనులు వెంటనే పూర్తి చేయాలని, ఈలోగా ట్యాంకుల ద్వారా అందిస్తున్న నీటికి అదనంగా మరింత ఎక్కువుగా నీటిని అందించే అవకాశాలను పరిశీలించాలని ఎమ్‌టిఎంసి అధికారులకు సూచించారు. ఎయిమ్స్ విస్తరణకు కొలనుకొండలో ఉన్న భూములను పరిశీలించి 15 రోజుల్లో పూర్తి స్థాయిలో నివేదిక అందించాలన్నారు. మంగళగిరి వైపు రహదారి విస్తరణకు, ▶ 2లో



సమావేశంలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు

రేషన్ పక్కదారి పట్టకుండా వాట్సప్ గ్రూపు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా తహశీల్దార్లు, మండల స్థాయి పాయింట్ ఇన్‌ఛార్జులు, డిఎం సివిల్ సప్లయిస్ తదితరులతో వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేయాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. సమాచారం ఎప్పటికప్పుడు ఈ గ్రూపులో ఉంచాలన్నారు. ప్రజా పంపిణి వ్యవస్థ బలోపేతానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరుతూ పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట కలెక్టరేట్‌లో బుధవారం సమీక్షించారు. మధ్యాహ్న భోజన పథకానికి సరుకుల సరఫరాలో సమస్యలుంటే అధికారులతో చర్చించి పరిష్కరించుకోవాలన్నారు. మండల స్థాయి స్టాక్ పాయింట్ల నుండి షాపులకు సరుకు సరఫాలలో మొబైల్ డిస్పర్సింగ్ యూనిట్ పాత్ర పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ హాస్టళ్లకు సరుకులను సకాలంలో అందించాలన్నారు. రేషన్ సరుకులు అక్రమంగా రవాణా కాకుండా ఆర్‌డివోలు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సమీక్షలో ఆర్‌డిఒలు రమాకాంత్‌రెడ్డి, మురళికృష్ణ, సరోజినీ, పౌర సఫరాల శాఖ డి.యం. వరలక్ష్మి, డిఎస్ఒ పద్మశ్రీ, డిఇఒ వెంకటేశ్వర్లు, సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఓబుల్ నాయుడు పాల్గొనారు.

8న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు ఎన్నికలు

1067 పాఠశాలల్లో నిర్వహణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-గుంటూరు : స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసి) ఎన్నికలకు షెడ్యూలు విడుదలైంది. గతంలో పేరెంట్ కమిటీల పేరుతో ఉన్న ఈ కమిటీలను ప్రస్తుత ప్రభుత్వం ఎస్ఎంసిలుగా మార్పు చేసి, ఎన్నికల షెడ్యూలు విడుదల చేసింది. దీంతో జిల్లా అధికారులు పాఠశాలల్లో కమిటీ ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని 1067 ప్రభుత్వ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో కమిటీల ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ జి.విజయలక్ష్మి తెలిపారు. గురువారం నోటిఫికేషన్‌తోపాటు, ఓటర్ల జాబితాను కూడా విడుదల చేస్తారు. ఓటర్ల జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే 5వ తేదీ సాయంత్రంలోపు సంబంధిత హెచ్ఎంలకు తెలపాల్సి ఉంటుంది. అదేరోజు తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తారు. గుంటూరు జిల్లాలో వివిధ ప్రభుత్వ మేనేజ్‌మెంట్లలో 810 ప్రాథమిక పాఠశాలలు, 76 ప్రాథమికోన్నత పాఠశాలలు, 181 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 8వ తేదీన ఎన్నికలు నిర్వహించి కమిటీ సభ్యులను, ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను ఎన్నుకుంటారు. తర్వాత వారితో ప్రమాణ స్వీకారం చేయించి, మొదటి సమావేశమూ నిర్వహించేలా షెడ్యూలు విడుదలైంది.

పిన్నెల్లికి మరోసారి బెయిల్ నిరాకరణ

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

రెండు హత్యాయత్నం కేసుల్లో అరెస్టు అయి రిమాండ్‌లో ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మరోసారి దాఖలు చేసిన బెయిల్ పిటీషన్‌ను గుంటూరు జిల్లా నాల్గో అదనపు న్యాయస్థానం బుధవారం తోసిపుచ్చింది. మే 13న టిడిపి ఏజెంటు నంబూరు శేషగిరిరావు, 14న కారంపూడి సిఐ నారాయణ స్వామిపై జరిగిన హత్యాయత్నం కేసుల్లో నిందితుడుగా ఉన్న పిన్నెల్లి రెండోసారి దాఖలు చేసిన బెయిల్ దరఖాస్తును న్యాయమూర్తి రుద్రపాటి శరత్‌బాబు కొట్టివేశారు. 18వ తేదీన బెయిల్ పిటీషన్ తిరస్కరించారని అప్పటి నుంచి ఇప్పటి వరకు కేసు దర్యాప్తులో ఎటువంటి పురోగతి లేదని, ఈ కేసుల్లో నిందితులను ఇంకా కొంత మందిని అరెస్టు చేయాల్సి ఉందని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అశ్వనీకుమార్ వాదించారు. ఇందుకు ఏకీభవించిన న్యాయమూర్తి బెయిల్ పిటీషన్‌ను కొట్టివేశారు.

భారీగా డిఎస్‌పిల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

చేయగా మంగళగిరి డిఎస్‌పి రవికాంత్, సౌత్ డిఎస్‌పి ఎమ్‌డి.మహబూబ్ బాషా, గురజాల డిఎస్‌పి సిహెచ్. శ్రీనివాసరావును పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలన్నారు. విఆర్‌లో ఉన్న బి.ప్రసాద్‌ను పల్నాడు జిల్లా దిశ స్టేషన్‌కు నియమించారు. గత ప్రభుత్వ హయాంలో వైసిపికి అనుకూలంగా పనిచేశారనే ఆరోపణలున్న వారికి పోస్టింగ్‌లు ఇవ్వకుండా విఆర్‌లో ఉంచారు. మిగతావారికి ప్రాధాన్యం లేని స్థానాలను కల్పించారు. ఈ మేరకు డిజిపి ద్వారకాతిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు.

ఎయిమ్స్‌లో పనులు సత్వరం పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

పైపులైన్ల ఏర్పాటుకు అటవీశాఖ అనుమతులకు చర్యలు తీసుకోవాలన్నారు. స్టామ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనులు పూర్తయ్యేవరకూ తాత్కాలికంగా స్టామ్ వాటర్ డ్రెయిన్ మళ్ళింపు పనులు అగస్టు 31 నాటికి పూర్తి చేయాలన్నారు. ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా లైన్లు అగస్టు 31 నాటికి పూర్తి చేయాలన్నారు. ఎయిమ్స్ కేటాయించిన స్థలం బదలాయింపు ప్రక్రియ వారంలో పూర్తి చేయాలని, వైద్య విద్యార్థుల శిక్షణ కోసం మంగళగిరి పరిసర ప్రాంతాల్లోని సిహెచ్‌సి, పిహెచ్‌సిల కేటాయింపు ప్రతిపాదనలను వెంటనే అందించాలని చెప్పారు. ఇప్పుడు చర్చించిన అంశాలపై 15 రోజుల్లో తనకు మళ్లీ నివేదించాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఓ పి.రోజా, ఎయిమ్స్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ శశికాంత్, అకడమిక్ డీన్ డాక్టర్ శ్రీమంత్ కుమార్ దాస్, సూపరింటెంట్ ఇంజనీరు ఎల్‌టీ కల్నల్ రవిశంకర్ సిన్హా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నటరాజ్ ఎఆర్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మీ, మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ బాషా, పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు సుబ్బారెడ్డి, అర్ అండ్ బీ ఈఈ సమర్పణరావు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గిరిబాబు, డీఎఫ్ఓ ఎం.శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

దోమలపై దండయాత్ర - ప్రజారోగ్యానికి జైత్రయాత్ర

ప్రజాశక్తి - తెనాలి

డెంగ్యూ మాసోత్సవం ముగింపు సందర్భంగా బుధవారం చినరావూరు తోట నుండి పాల్ రాజ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినిలచే ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా మలేరియా అధికారి టి మురళీకష్ణ సుబ్బరాయణం, తెనాలి పట్టణ స్పెషల్ ఆఫీసర్ ఎ గాయత్రీ దేవి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దోమలు ప్రజారోగ్యానికి ప్రథమ శత్రువులని, నీటి నిల్వలు దోమలకు ఆవాసాలని చెప్పారు. దోమలను అరికట్టడంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలన్నారు. చేయి కలుపుదాం డెంగ్యూ నివారిద్దాం అనే నినాదంతో ఫ్ల కార్డులను చేబూని ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర రెడ్డి, గుంటూరు సబ్ యూనిట్ అధికారి ఎస్ శివ గణేష్, హెచ్ఈవో ఎ.బాలచంద్రమౌళి, పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, గ్రామీణ సబ్ యూనిట్ అధికారి వి పున్నారెడ్డి, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ పి రాధిక, మలేరియా సూపర్వైజర్లు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన వారికి అభినందన సత్కారాలు



ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన 24 మంది అధ్యాపకేతర సిబ్బందికి ఇన్‌ఛార్జి వీసీ కె.గంగాధరరావు బుధవారం సత్కరించారు. వికాస ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో అధ్యాపక ఇతర సిబ్బంది ఉద్యోగ విరమణ వేడుకను డైక్‌మెన్ ఆడిటోరియంలో నిర్వహించగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి అధ్యాపకులతో పాటు అధ్యాపకేతర సిబ్బంది సహకారం ఎంతో అవసరమన్నారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని చెప్పారు. రెక్టార్ కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం మాట్లాడుతూ ఉద్యోగులు సహకారంతో వర్సిటీ అభివృద్ధి వేగంగా పెరిగిందని, వారు వర్సిటీని తమ కుటుంబంలాగే భావించి పని చేశారని అన్నారు. వికాస, అధ్యక్ష కార్యదర్శులు టి.అనిల్ కుమార్, కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ చాలామంది ఉద్యోగులు సర్వీస్ విషయంలో న్యాయస్థానాల్లో కేసులు పెండింగ్ ఉన్నాయని, అవి క్లియర్ అవగానే వారికి పెండింగ్లో ఉన్న వాటిని పరిష్కరించాలని కోరారు. ఇదిలా ఉండగా ఉద్యోగ విరమణ చేస్తున్నవారి కుటుంబాలు, బంధువులు, వర్సిటీ యంత్రాగం మొత్తం ఒకచోటకు చేరడంతో వర్సిటీలో సందడి వాతావరణం నెలకొంది.

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండలంలోని ఉప్పలపాడు జెడ్‌పి పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్న కొల్లా నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాలలో బుధవారం వీడ్కోలు, సత్కార సభ నిర్వహించారు. కార్యక్రమానికి ఎబి పాలెం జెడ్‌పి పాఠశాల హెచ్‌ఎం జగదీశ్వరరావు అధ్యక్షత వహించగా ఎంఇఒ-1 డి.బాలసుబ్రమణ్యం, ఎంఇఒ-2 జాకబ్ మాట్లాడుతూ 34 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న కొల్లా నాగేశ్వరరావు ఎంతోమందిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని అభినందించారు. అనంతరం నాగేశ్వరరావు దంపతులను ఉపాధ్యాయులతోపాటు గ్రామస్తులు, విద్యార్థులు సన్మానించారు. ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ జి.మోహనరావు, ఎంపిటిసి బి.లక్ష్మీ ప్రసన్న, అశోక స్కూల్ డైరెక్టర్ పి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక ఆర్‌టిసి డిపో మేనేజర్‌గా బుధవారం ఉద్యోగ విరమణ చేసిన మంత్రు నాయక్‌ను సూపర్వైజర్ అసోసియేషన్, వివిధ యూనియన్ నాయకులు సత్కరించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ట్రాఫిక్ డీజీ నాయక్ మాట్లాడుతూ డిపో మేనేజర్‌గా మంత్రు నాయక్ బాధ్యతలు చేపట్టిన సుమారు రెండున్నరేళ్లలో డిపోను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. శ్రీశైలం రూట్‌లో అత్యధిక ఈపీకే, ఓఆర్ పెంచి మంగళగిరి డిపోను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలోకి తీసుకెళ్లారన్నారు. మంత్రు నాయక్ మాట్లాడుతూ తమ విధి నిర్వహణలో సహాయ సహకారాలు అందించిన ఉద్యోగస్తులు, యూనియన్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్యారేజీ ఎఎంఎఫ్ ఎన్.శ్రీనివాసరావు, ఆఫీస్ సూపరింటెండెంట్ శర్మ, సీసీఎస్ డెలిగేట్ బి.సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పొన్నూరు

మున్సిపాల్టీలో 34 ఏళ్లుగా స్విచ్‌మెన్‌గా గంటా మోహన్‌రావు విశేష సేవలు అందించారని ఎమ్మెల్యే డి.నరేంద్ర కుమార్ ప్రశంసించారు. మోహన్‌రావు ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం నిర్వహించిన సత్కార సభకు మున్సిపల్ కమిషనర్ సిఎంఇ నయీమ్ అహ్మద్ అధ్యక్షత వహించారు. మోహన్‌రావును ఎమ్మెల్యేతోపాటు కమిషనర్, సిబ్బంది సన్మానించారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

విద్యార్థుల మనసెరిగి పాఠాలు బోధించి వారికి మార్గదర్శకం కావాలని ఉపాధ్యాయులకు ఎంఇఒ-1



డి.బాలసుబ్రహ్మణ్యం సూచించారు. హెచ్‌ఎంల సమావేశం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో బుధవారం నిర్వహించగా ఎంఇఒ-2 జాకబ్ మాట్లాడుతూ జిల్లా అధికారుల సూచనలను పాటించి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు అనంతరం ఉద్యోగ విరమణ చేస్తున్న ఎంఇఒ-1 బాలసుబ్రహ్మణ్యంను అందరూ సత్కరించారు. అశోక స్కూల్ డైరెక్టర్ పి.లక్ష్మీనారాయణ, సాంబశివరావు, భాగ్యరాజు, రవిశంకర్, పద్మ, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పోలీసుశాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసి పలువురికి జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ బుధవారం సాయంత్రం సన్మానం చేశారు.వారికి ఆత్మీయ వీడ్కోలు పలికి వారి శేష జీవితం ఆరోగ్యంతో ఆనందంగా కుటుంబ సభ్యుల మధ్య గడపాలని ఆకాక్షించారు. సుదీర్ఘ కాలం క్రమశిక్షణతో, బాధ్యతయుతంగా విధులు నిర్వహించి, పదవి వీరమణ పొందడం అభినందనీయం అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వారిలో స్పెషల్ బ్రాంచి డిఎస్‌పి టి. రత్నస్వామి, ఎఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, పెదబాబు, ఎస్.కె.ఎండి జానీ, మోహనరావు, హెడ్ కానిస్టేబుల్ దేవరాజు, ఎఆర్ కానిస్టేబుల్ రత్నరాజు, తుళ్లూరు ట్రాఫిక్ కానిస్టేబుల్ కమల భాష తదితరులకు ఎస్‌పి సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు అదనపు ఎస్‌పిలు, డిఎస్‌పిలు వారిని సత్కరించారు.



ప్రమాదభరితంగా ఎకో పార్క్‌ఉడెన్ వ్యూ పాయింట్

ప్రజాశక్తి - మంగళగిరి

గతేడాది సెప్టెంబర్‌లో ప్రారంభమైన స్థానిక ఎకో పార్కులోని ఉడెన్ వ్యూ పాయింట్ పాడైపోయి ప్రమాదకరంగా మారింది. మంగళగిరితో పాటు విజయవాడ, గుంటూరు ప్రాంతాల నుండి ఎకో పార్కుకు వచ్చే పర్యాటకుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. పార్క్‌కు వచ్చిన వారు వ్యూ పాయింట్ పైకి ఎక్కి ప్రకృతి అందాలను వీక్షించేందుకు ఇష్టపడుతుంటారు. కాగా పాడయిపోయిన వుడెన్ వ్యూ పాయింట్ పర్యాటకులకు నిరాశను మిగులుస్తోంది. పర్యవేక్షణా లోపం కారణంగా వ్యూ పాయింట్ చెక్కలు ఊడిపోయి, కొంతమేర విరిగిపోయి, మేకులతో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా దర్శనమిస్తుండటంతో సందర్శకులు నిరాశకు లోనవుతున్నారు. ఈ వ్యూ పాయింట్ పై పర్యాటకులు నిలబడితే కూలిపోయే అవకాశం ఉందని, ప్రమాదం జరగక ముందే అధికారులు మరమ్మతులు చేయించాలని పర్యాటకులు కోరుతున్నారు.

ఇదిలా ఉండగా పార్క్‌లో తాగు నీరు అందుబాటులో ఉండడం లేదని, పార్కు వద్ద మినహా ట్రెక్కింగ్, రెండు ఉడెన్ వ్యూ పాయింట్ల వద్ద అధికారులు తాగునీటి వసతి లేని కారణంగా ఇబ్బందులకు గురవుతున్నామని పర్యాటకులు వాపోతున్నారు. పార్కులో ఉన్న షాపులో ఆహార పదార్థాలు, వాటర్ బాటిల్స్, కూల్ డ్రింక్స్‌ను ఎంఆర్‌పికి మించి విక్రయిస్తున్నారని పర్యాటకులు చెబుతున్నారు.



22 మంది సిఐల బదిలీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు రేంజి పరిధిలో పలువురు సిఐలను బదిలీ చేస్తూ ఐజి సర్వశ్రేష్ట త్రిపాఠి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పలువురు సిఐలు ఇప్పటికే తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న స్థానాల్లో వారినే తిరిగి నియమించారు. అలాగే విఆర్‌లో ఉన్న పలువురికి పోస్టింగ్ లభించింది.

సిఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
టి.విజయకృష్ణ	సిసిఎస్ ఒంగోలు	రాపూరు సర్కిల్
పి.సుబ్బారావు	రేంజి విఆర్	వెంకటాచల సత్రం
ఎం.శ్రీనివాసరావు	రేంజి విఆర్	చీరాల టౌన్
ఎం.విజయచరణ్	సైబర్ క్రైం,పల్నాడు	నర్సరావుపేట ఒన్‌టవున్
యు.శోభన్‌బాబు	స్పెషల్‌బ్రాంచి పల్నాడు	వినుకొండ టౌన్
పి.రామకృష్ణ	వేమూరు	నర్సరావుపేట రూరల్
బి.సుబ్బానాయుడు	ఎస్‌సిఎస్‌టిసెల్,పల్నాడు	చిలకలూరిపేట రూరల్
కె.వెంకట ప్రసాద్	ఎస్‌బి,గుంటూరు	అచ్చంపేట
ప్రత్తిపాటి సురేష్	రేంజి విఆర్	పెదకూరపాడు
పి.శ్రీనివాస్	సత్తెనపల్లి టౌన్	సత్తెనపల్లి రూరల్
ఎం.సుబ్బారావు	చీమకుర్తి అటాచ్	చీమకుర్తి
సిహెచ్ హజరత్తయ్య	దిశ బాపట్ల	సింగరాయకొండ
వై.నాగరాజు	రేంజి విఆర్	ఒంగోలు ఒన్‌టవున్
కె.అజయ్‌కుమార్	నెల్లూరు మహిళా పిఎస్	ఒంగోలు తాలుకా
పి.వెంకటనారాయణ	వేదాయపాలెం	కనిగిరి సర్కిల్
ఎ.మల్లిఖార్జునరావు	రేపల్లె రూరల్	రేపల్లె టౌన్
పి.కిరణ్	రేంజి విఆర్	పట్టాభిపురం
ఎం.శేషగిరిరావు	రేంజి విఆర్	మార్టూరు
కె.వెంకట్రావు	సిసిఎస్ గుంటూరు	సంతమాగులూరు
కె.శ్రీనివాస్	అరండల్‌పేట అటాచ్	అరండల్‌పేట
డి.వినోద్‌కుమార్	మంగళగిరి అటాచ్	మంగళగిరి టౌన్
యార్లగడ్డ శ్రీనివాసరావు	మంగళగిరిరూరల్	మంగళగిరి రూరల్
కె.వంశీధర్	నల్లపాడు అటాచ్	నల్లపాడు
సిహెచ్ కోటేశ్వరరావు	నెల్లూరు సిసిఎస్	నెల్లూరు ఒన్‌టౌన్

నేటి నుండి తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి -పల్నాడు జిల్లా

నేటి నుండి (ఆగస్టు 1) ఈ నెల 7వ తేదీ వరకు జరగనున్న తల్లిపాల వారోత్సవాలలో భాగంగా తల్లి పాలు అవశ్యకత గురించి ప్రతి తల్లికి, గర్భిణులకు, బాలింతలకు వివరించాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశించారు. ఈ సందర్భంగా వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి తదితరులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో, గ్రామ సచివాలయాలలో , అంగన్వాడీ కేంద్రాలలో తల్లి పాల అవశ్యకతను గర్భిణులకు, బాలింతలకు తెలియజేయాలన్నారు. ప్రధానంగా బిడ్డ పుట్టిన వెంటనే ఒక గంటలోపు తల్లిపాలు తాగించాలని 6 నెలల వరకు కేవలం తల్లిపాలను మాత్రమే బిడ్డకు ఇవ్వడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుం దన్నారు. చిన్నారికి 6 నెలల నుండి 2 ఏళ్ల వయసు వచ్చే వరకు తల్లిపాలు అందించడం ద్వారా చిన్నారులలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. వినాయకం, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ డి.రేవతి పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారి తదితరులు

'రోటరీ' బెంచీలు ప్రారంభం



ప్రజాశక్తి-తెనాలి

రోటరీ సభ్యుల సహ కారంతో స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఆవ రణలో ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలను బుధవారం పిడిజి అన్నే రత్న ప్రభాకర్ ప్రారంభించారు. క్లబ్ సభ్యుల సహకారంతో మొత్తము 21 బెంచీలను పెదరావూరు, నంది వెలుగు, తేలప్రోలు, పట్టణంలోని ఎడ్ల లింగయ్య కాలనీ, నాజరుపేట, గోశాల, ఐటిఐ లో జరిగిందని, దాదాపు లక్ష రూపాయలు వెచ్చించి బెంచీలు ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షులు ఈదర శ్రీనివాసరావు చెప్పారు.

ఆక్రమణలు తొలగించండి

డిప్యూటీ తహశీల్దార్‌కు కంణాలపల్లి గ్రామస్తుల ఫిర్యాదు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం కంణాలపల్లి ఎంపిపి పాఠశాల ఎదురుగా ఉన్న ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తులు ఉప తహ శీల్దార్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు.ఎన్టీఆర్ విగ్ర హం ఏర్పాటు కోసం సర్వే నెంబర్ 77-1 లో ఎన్టీఆర్ విగ్రహానికి మా పూర్వీకులు 6 సెంట్లు స్థలాన్ని వదిలి పెట్టారని గ్రామానికి చెందిన కంటు బ్రహ్మయ్య అనే వ్యక్తి ఆక్రమించు కున్నాడని. ఖాళీ చేయమని అడిగితే దుర్భాష లాడుతూ దౌర్జన్యం చేస్తూ బెదిరిస్తున్నాడ, ఆక్రమణ తొలగించాలని కంకణాలపల్లి గ్రామస్తులు 50 మంది ఉపతహశీల్దార్ రాజేంద్ర ప్రసాద్ కు ఫిర్యాదు చేశారు. ఆస్థలంలో గ్రామ స్తులు సౌకర్యార్థం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

న్యాయపోరాటం చేస్తా

ఎన్టీఆర్ విగ్రహం అభివృద్ధి పేరుతో తన ఇంటిని కూల్చి వేసేందుకు యత్నిస్తున్నారని కంకణాలపల్లికి చెందిన కంటు బ్రహ్మయ్య వాపోయాడు. నాలుగు నెలలు సమయం అడిగినప్పటికీ తన ఇంటిని ధ్వంసం చేయాలని చూస్తున్నా రని ఆరోపించాడు. ఈ విషయమై న్యాయపోరాటం చేస్తా నని చెప్పాడు.

వాహనదారుల వద్ద అవసరమైన పత్రాలు తప్పనిసరి

ప్రజాశక్తి-మాచర్ల

వాహనదారులు అవసరమైన పత్రాలతో రహదారులపైకి రావాలని అర్బన్ ఎస్.ఐ గోపాల్ సూచించారు. పట్టణంలో ఆయన వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా తగిన పత్రాలు లేని వాహనదారులపై కేసులు నమోదు చేసి పెనాల్టీ విధించారు. ఎస్.ఐ గోపాల్ మాట్లాడుతూ తమ తనిఖీలలో నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. రహదారులపై నిబంధనలకు లోబడి డ్రైవింగ్ చేయాలన్నారు. తగిన పత్రాలు లేకపోతే కేసులు నమోదు చేసి పెనాల్టీ విధిస్తామని హెచ్చరించారు.





మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	43,934
మిర్చి ఎగుమతి	:	41,608
మిర్చి నిల్వ	:	19,806

మిర్చి ధరలు

	రూపాయలలో
334	8,000 - 17,000
నెం.5	9,000 - 12,500
273	10,000 - 11,000
341	9,000 - 16,000
	నాన్ ఎసి
తేజ	7,500 - 18,600
బడిగి	8,500 - 16,300
దేవనూరు డీలక్స్	10,000 - 13,500
తాలుకాయలు	4,500 - 12,000
	ఎసి
334	9,000 -12,000
273	9,500 - 10,000
341	10,000 - 15,500
4884	13,000 - 14,000
తేజ	9,000 - 18,600
బడిగి	9,000 - 14,000
దేవనూరు డీలక్స్	10,000 - 14,000
తాలుకాయలు	5,000 - 11,000



అన్నదానం కోసం రూ.15 వేలు అందజేత

ప్రజాశక్తి-మాచర్ల

ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ బుధవారం నాటికి 34వ రోజుకి చేరింది. బుధవారం మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ రంగా సత్యనారాయణ తన భార్య రంగా లక్ష్మీ జ్ఞాపకార్థం బుధవారం అన్నదానానికి అవసరమైన రూ.15వేలను నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా రంగా సత్యనారాయణ మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు ఆర్యవైశ్యులకు అవకాశం రావటం హర్షణీయమన్నారు.

ప్రభుత్వం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించే వరకు స్థానిక ఎం.ఎల్.ఎ జూలకంటి బ్రహ్మారెడ్డి ఆర్యవైశ్యులకు అన్నదానం చేసే అవకాశం ఇవ్వటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వహకులు సూరె యల్లమంద, దారివేముల రామక్రిష్ణ, చీదేళ్ళ ఆంజనేయులు, పోలా పద్మ, కంభంపాటి వెంకటరమణ, గౌరు వెంకట నరసింహారావు తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.

వ్యవసాయ రుణాలు అందేనా?

- కమిటీల పేరుతో కాలయాపన
- ఆలస్యమైతే లక్ష్యం చేరేదెలా?

ప్రజాశక్తి -పెదకూరపాడు

జూన్ నుండి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వర్షాలు అనుకూలంగా ఉన్నాయి. రైతులు వంటలు సాగు చేశారు. రైతుల రుణాల కోసం ఎదురుచూస్తున్నారు. గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు 167 (సొసైటీలు) ఉన్నాయి. వీటిలో పెదకూరపాడు బ్యాంకు పరిధిలో నాలుగు, అమరావతి పరిధిలో మూడు, క్రోసూరు పరిధిలో మూడు ఉన్నాయి. బెల్లంకొండ లో ఒకటి ఉంది. ప్రతి సంవత్సరం జూన్‌లో రైతులకు సంఘాలు రుణాలు ఇవ్వడం ప్రారంభిస్తాయి. గత సంవత్సరం కూడా జూన్‌లోనే ప్రతి సంఘానికి కోటి 50 లక్షల నుంచి రెండు కోట్ల వరకు రుణాలు ఇవ్వాలని కనీస లక్ష్యంగా నిర్ణయించారు. కొన్ని లక్ష్యాన్ని దాటి రుణాలు అందించాయి.

సంఘానికి రూ.3 కోట్ల టార్గెట్

ప్రతి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి మూడు కోట్ల రూపాయలు రైతులకు రుణాలు ఇవ్వాలని జులై 5వ తేదీన జరిగిన సమావేశంలో నిర్ణయించారు. వీటిలో ఎకరానికి 90 వేల రూపాయలు రుణము ఇస్తారు. బంగారు రుణాలు అందిస్తారు. క్యాష్ క్రెడిట్ లోన్స్ వ్యవసాయానికి బాగా ఉపయోగపడతాయి. పెద్ద మొత్తంలో కావలసినవారు దీని ద్వారా తీసుకుంటారు. ఏ వాణిజ్య బ్యాంకు ఇవ్వని దీర్ఘకాలిక రుణాలు పరపతి సంఘాలు మాత్రమే అందిస్తున్నాయి. రుణాల కోసం రైతులు పరపతి సంఘాల కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగిపోయేలా తిరుగుతున్నారు.

ఎన్నికల ఫలితాలు అనంతరం ప్రభుత్వం మారడంతో వైసీపీ ప్రభుత్వంలో నియమించిన ఇద్దరు డైరెక్టర్లు ,ఒక చైర్పర్సన్ కమిటీలు రద్దయ్యాయి. కొత్త కమిటీలు వస్తున్నాయని సొసైటీ అధికారులు, బ్యాంకు ఉద్యోగులు రైతులకు జూన్ నుండి తెలియజేస్తూ ఉన్నారు. ఈ కమిటీలు రాజకీయపరంగా నామినేటెడ్ జరుగుతాయి. ఆ కమిటీలు వచ్చిన తర్వాత రుణాలు ఇవ్వటం జరుగుతుందని సొసైటీ అధికారులు తెలుపుతున్నారు.

పిఐసిల నియామకం

రైతులకు తొందరగా రుణాలు ఇవ్వాలని పర్సన్ ఇన్చార్జెస్ ను ప్రతి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి నియమించారు. వీరు జిల్లా స్థాయిలో సహకార సంఘం లో పనిచేస్తున్నారు. బాధ్యతలు తీసుకున్న తర్వాత రుణాలు ఇస్తారని అందరూ ఆశించారు. కానీ వీరు కూడా సంఘాల ఉద్యోగుల జీతాల బిల్లుల వరకే పరిమితమయ్యారు. వీరు కూడా కొత్త కమిటీలు వస్తాయని ఆ కమిటీలు రుణాలు మంజూరు చేస్తాయని చెబుతున్నారు. ఈ వారం నియమిస్తారు. వచ్చేవారం నియమిస్తారని ప్రచారానికి పరిమితమయ్యారు.

కేటాయింపులు లేవు

సహకార పరపతి సంఘానికి మూడు కోట్లు రూపాయలు వ్యాపారం చేయాలని లక్ష్యం నిర్ణయించారు. కానీ ఇంతవరకు వాటిని కేటాయించి రిలీజ్ చేయలేదు. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందాన లక్ష్యంగానే మిగిలిపోయింది. రిలీజ్ ఉత్తర్వులు వచ్చిన తర్వాత మాత్రమే రుణాలు ఇవ్వటానికి అవకాశం ఉన్నది. ఖరీఫ్ పంట కాలం ఆగస్టు సెప్టెంబర్ తో ముగినున్నది.

కమిటీలతో కాలయాపన?

టిడిపి కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల పందారం ఇంకా ప్రారంభించలేదు. జిల్లాస్థాయిలో జి డి సి సి బ్యాంకుకు కమిటీని నియమించాలి. ప్రతి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి కూడా కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ కమిటీలు వచ్చిన తర్వాత మాత్రమే రుణాలు ఇవ్వడం జరుగుతుందని ఖరాకండిగా పీఐసీలు రైతులకు తేల్చి చెప్తున్నారు. వెంటనే కమిటీలు నిర్వహించి రుణాలు ఇవ్వాలని లేదా పర్సన్ ఇన్చార్జి ద్వారా రైతులకు రుణాలు ఇవ్వటానికి ఏర్పాట్లు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రిని జిల్లా ఉన్నతాధికారులను రైతులు కోరుతున్నారు.



75 తాళ్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం

రుణాలు వెంటనే ఇవ్వాలి

రైతు సంఘం జిల్లా నాయకులు ఆవుల ఆంజనేయులు



సొసైటీల ద్వారా రైతులకు వెంటనే క్రాప్ లోన్ ఇవ్వాలని రైతు సంఘం జిల్లా నాయకులు ఆవుల ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా రుణాలు ఇవ్వకపోవడం సరైన విధానం కాదన్నారు. వెంటనే బోర్డు నియమిస్తారా లేక ఉన్న పర్సనల్ ఇన్చార్జి ద్వారానే తక్షణమే వ్యవసాయ రుణాలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.



మధ్యాహ్నభోజనం తనిఖీ

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని తాళ్లూరు జూనియర్ బేసిక్ ప్రాథమిక పాఠశాలలో పెదకూరపాడు మండల విద్యాశాఖ అధికారి 2 సత్యనారాయణ రికార్డులను బుధవారం పరిశీలించారు. విద్యార్థులను పుస్తకాలు పరిశీలించి, వారిని పలు ప్రశ్నలు వేసి సమాధానాలు అడిగి తెలుసుకున్నారు అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.



రాకేష్ ను సత్కరిస్తున్న సంస్థ సభ్యులు

గుండాల రాకేష్‌కు సాహిత్య సేవా పురస్కారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ సౌజన్యంతో అంతర్జాతీయ సాహిత్య సేవా సంస్థ -శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో కాకినాడ పి ఆర్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన గోదావరి కవితోత్సవంలో పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన గుండాల రాకేష్ కు" సాహితీ సేవా పురస్కారం" అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో తెలుగు భాషా గొప్పతనంపై రాకేష్ కవితా గానం చేశారు. మాతృభాష, సాహిత్యం, కళ, సంస్కృతీ సంప్రదాయాల అభివృద్ధికి కవిత్వం ద్వారా రాకేష్ చేస్తున్న కృషిని అభినందిస్తూ ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సంబరాలలో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు అనేక రాష్ట్రాల నుండి కవులు పాల్గొన్నారు.



నామినికీ ఓచర్‌ను అందజేస్తున్న బ్రాంచ్ మేనేజర్, సిబ్బంది

గంటలో ఎల్‌ఐసి పాలసీ క్లైమ్ పరిష్కారం

ప్రజాశక్తి-వినుకొండ

వినుకొండ ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో గంట వ్యవధిలో పాలసీ క్లైమ్ ను సీనియర్ బ్రాంచ్ మేనేజర్ డి. శ్రీనివాసరావు బుధవారం పరిష్కారం చేశారు. శావల్యాపురం గ్రామానికి చెందిన చీమలదిన్నె అచ్చయ్య మృతి చెందడంతో పాలసీ చేసిన సీనియర్ ఏజెంట్, ఎండిఆర్టి ఎస్. కోటేశ్వరరావు తక్షణమే క్లెయిమ్ ఫారాలు పూర్తిచేసి కార్యాలయంలో అందజేశారు. బ్రాంచ్ మేనేజర్ ఆదేశాల మేరకు క్లెయిమ్స్ ఏవో ఆర్ .రత్నరాజు, ప్రసన్న గంట వ్యవధిలో క్లైమ్ పరిష్కారం చేశారు. నగదును నామిని అయిన మృతుడి భార్య పేరమ్మ బ్యాంకు అకౌంట్లో జమ చేశారు. అందుకు సంబంధించిన ఓచర్‌ను బ్రాంచ్ మేనేజర్, సిబ్బంది, ఏజెంట్ ఆధ్వర్యంలో పేరమ్మకు అందజేశారు. తన భర్త పాలసీకి సంబంధించిన క్లైమ్ నగదును వెంటనే ఇచ్చినందుకు ఎల్ఐసి అధికారులకు, ఏజెంట్ కు పేరమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు పర్సా సత్యనారాయణ శత జయంతి

సభను జయప్రదం చేయాలని సిఐటియు పిలుపు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పర్సా సత్యనారాయణ జీవితం నేటి తరానికి ఎంతో స్ఫూర్తి దాయకమని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే పర్సా సత్యనారాయణ శత జయంతి సభ పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో గురువారం నిర్వహించనున్న సభకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్. నరశింగరావు, రాష్ట్ర కార్య దర్శిలు కె.ధనలక్ష్మి, యస్.కె. ముజఫర్ అహ్మద్ తదితరులు పాల్గొని ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం ఆంజనేయ నాయక్ మాట్లాడుతూ నేడు రాజకీయంగా ఎదగడం కోసం కుటుంబ సభ్యులను సైతం దూరం చేసుకుంటున్న నాయకులు ఉన్న సమాజంలో నాడు విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు పోరాటం కోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన ఆదర్శ నేత మాజీ ఎమ్మెల్యే పర్సా అని కొనియాడారు. 1970 లో సిఐటియు ఆవిర్భావం నుంచి 2002 వరకు సిఐటియు ఏపి రాష్ట్ర అధ్యక్షులుగా ఉమ్మడి రాష్ట్రంలో విచ్ఛిన్నమైన ఉద్యమాన్ని తిరిగి కూడ గట్టేందుకు నాటి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నండూరి ప్రసాదరావుతో రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, పారిశ్రామిక కేంద్రాల్లో విస్తృతంగా పర్యటించారన్నారు. .శత జయంతి సభలో అసంఘటిత రంగ కార్మికులు, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు,స్కీం వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు క్రీడలు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడతాయని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం వెల్దుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాచర్ల పట్టణంలో నిర్వహించిన స్వర్గీయ జూలకంటి నాగిరెడ్డి మెమోరియల్ ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి సయ్యద్ అన్వర్ భాష ఆధ్వర్యంలో టోర్నమెంట్ నిర్వహించారు. మొదటి బహుమతి పల్నాడు ఓవర్సీస్ జట్టు రూ.1,33,318 నగదు బహుమతి, రెండవ బహుమతి ఎస్ ఆర్ తండా జట్టు రూ.93,318, మూడవ బహుమతి పెద్దారెడ్డి జట్టు రూ.63,318, నాలుగవ బహుమతి నరేంద్ర 11 జట్టు రూ.33,318 గెలుచుకున్నాయి. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ రాజు కు రూ.10 వేల నగదుతో పాటు బెస్ట్ బ్యాట్స్ మెన్ కింద ఇంగ్లీష్ విల్లో బ్యాట్ అందజేశారు. బెస్ట్ బౌలర్ గా ఎన్నికైన కోటికి అడిడాస్ షఉస్ అందజేశారు. విజేతలందరిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జూలకంటి అక్కిరెడ్డి, సయ్యద్ అన్వర్ బాషా, జూలకంటి చిరంజీవిరెడ్డి, పులుసు ప్రతాపరెడ్డి, పంగులూరి పుల్లయ్య, రామ టాకీస్ జానీ, గోరంట్ల ధీరజ్ దొండపాటి శివనాగు, గోరంట్ల శ్రీ వాత్సవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు



క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి



ప్రజల సహకారంతో పట్టణాభివృద్ధి

కౌన్సిల్ సమావేశంలోఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

ప్రజల సహకారంతో పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ అన్నారు . బుధవారం మున్సిపల్ చైర్మన్ సిహెచ్ లక్ష్మీతులసి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన ఎక్స్ అఫిషియో సభ్యుని హోదాలో ఆయన పాల్గొని ప్రసంగించారు . ముందుగా కమిషనర్ షమ్మీ, కన్నాతో ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తాను ఒక ఏడాదిగా ఇక్కడే ఉన్నానని ,నియోజక వర్గంతో పాటు పట్టణంలోని ప్రజల అవసరాలు , ఇబ్బందులను గుర్తించినట్లు చెప్పారు. ప్రధానంగా పట్టణంలోని లోతట్టు ప్రాంతమైన నాగన్నకుంట తదితర ప్రాంతాలను గుర్తించాను అన్నారు. ఏ మాత్రం వర్షం కురిసిన ఈ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. యుద్ధ ప్రాతిపదికన ముంపునకు గురికాకుండా తగు చర్యలు తీసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఇందుకోసం అవసరమైన నిధులు ప్రభుత్వ గ్రాంటు ద్వారా ఇప్పించేందుకు సంబంధిత అధికారులతో చర్చించామన్నారు. అనంతరం కౌన్సిల్ ఫ్లోర్ లీడర్గా టిడిపి కౌన్సిలర్ మేరీగ్రేస్, డిప్యూటీ ఫ్లోర్ లీడరగా జనసేన పార్టీ కౌన్సిలర్ ఆర్ సుమన్ల నియమితులయ్యారు. అనంతరం 43 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ లో ప్రవేశపెట్టగా, అందులోని 18 , 43 అంశాలను ఆమోదించలేమని ఫ్లోర్ లీడర్ ప్రకటించారు పై అంశాలలో పలు అవకతవకలు ఉన్నాయని వాటిలోని లోపాలు గుర్తించటంతో పాటు సంబంధిత వారి నుండి అ నష్టాన్ని రాబాట్టాలని కోరారు. అనంతరం కన్నాను ఘనంగా సత్కరించారు. సమావేశంలో ఎల్లినేడి రామస్వామి చౌట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లను నూరుశాతం ఇంటివద్దే ఇవ్వాలి

నగర ఇన్‌ఛార్జి కమిషనర్ హరికృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ లబ్ధిదారుల ఇంటి వద్దనే నూరు శాతం జరగాలని, పంపిణీలో సమస్యలేమీ రాకుండా నోడల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను నగర కమిషనర్ (ఎఫ్‌ఎసి) ఎస్.హరికృష్ణ ఆదేశించారు. బుధవారం నగర కమిషనర్‌గా భాధ్యతలు తీసుకున్న అనంతరం కమిషనర్ చాంబర్‌లో అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతలతో పెన్షన్ పంపిణీ, ఇతర అంశాలపై సమీక్షించారు. వార్డు సచివాలయాల వారీగా విధులు కేటాయించిన నోడల్ అధికారులు పింఛన్ల పంపిణీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజారోగ్య అధికారులు, శానిటేషన్ కార్యదర్శులు మెరుగైన పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో వర్షం నీరు నిల్వ లేకుండా, తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం విభాగాధిపతులు, అధికారులు కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మీ, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, వెంకటలక్ష్మీ, సిటీప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎస్‌ఇ శ్యాంసుందర్, ఎంహెచ్‌ఓ మధుసూదన్, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంక్ కోసం కృషి

స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో గుంటూరు నగరపాలక సంస్థకు మెరుగైన ర్యాంకు సాధించడానికి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటామని ఎంహెచ్‌ఓ (ఎఫ్‌ఎసి) మధుసూదన్ తెలిపారు. స్వచ్ఛసర్వేక్షణ్ 2024లో తీసుకోవాల్సిన చర్యలపై నగర కమిషనర్ (ఎఫ్‌ఎసి) ఎస్.హరికీష్ణ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజారోగ్య అధికారులు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో బుధవారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఎంహెచ్‌ఓ మాట్లాడుతూ నగరంలో మెరుగైన పారిశుధ్యాన్ని సాధించడానికి 100 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని, అందుకు తగిన విధంగా వార్డు సచివాలయాల వారీగా కృషి చేస్తే గతేడాది కంటే మెరుగైన ర్యాంక్ సాధించవచ్చని అన్నారు. ముఖ్యంగా ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలని, ప్రతి కమర్షియల్ సంస్థ డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకునేలా కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు అవగాహన కలిగించాలని చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా యాంటీ మలేరియా చర్యలు చేపట్టాలని, ఖాళీస్థలాల యజమానులే తమ స్థలాలను శుభ్రం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొన్ని డివిజన్లలో ప్రదాన కేంద్రాల్లో డంపర్ బిన్ల వద్ద వ్యర్థాలు అధికంగా ఉండి, స్థానిక ప్రజలకు ఇబ్బందిగా ఉంటుందని, ఆయా పాయింట్స్‌ని బ్లాక్ పాయింట్స్‌గా గుర్తించి చుట్టు పక్కల ప్రజలకు వ్యర్థాలు వేయకుండా అవగాహన కల్పించాలని చెప్పారు. రోడ్లపై, కాల్వల్లో వ్యర్థాలు వేస్తే అపరాధ రుసుం విధించాలని స్పష్టం చేశారు. సమావేశంలో శానిటరీ సూపర్వైజర్లు రాంబాబు, ఆనంద కుమార్, ఆయుబ్ ఖాన్, సోమ శేఖర్, సాలిడ్ వెస్ట్ మేనేజ్మెంట్ స్పెషలిస్ట్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎంహెచ్‌ఒ మధుసూదన్



వీసీకి టిజెపిఎస్ ప్రిన్సిపాల్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కంచర్ల గంగాధర్‌రావును, రెక్టార్ ప్రొఫెసర్ రత్నషీలామణిని, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సింహాచలంను స్థానిక టిజెపిఎస్ కాలేజి ప్రిన్సిపాల్ మేజర్ ఎబిపి మనోహర్, పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.వీసీ మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో ఉన్న విద్యా సంస్థలను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే విధంగా, యూనివర్సిటీ గౌరవం వ్యాప్తి చెందేలా చూడవలసిన బాధ్యత ఇప్పుడు ఉందని, దానికి తగిన విధంగా అందరి సలహాలు, సూచనలతో ముందుకు వెల్దామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంకామ్ శాఖాధిపతి డాక్టర్. సీతలపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సత్కారం పొందుతున్న రాఘవయ్య దంపతులు

కార్మిక హక్కుల కోసం రాఘవయ్య కృషి

ఉద్యోగ విరమణ సభలో వక్తలు - సత్కారం

ప్రజాశక్తి-తాడేపల్లి : కార్మికుల హక్కుల కోసం సిఐటియు యూనియన్ ద్వారా రాఘవయ్య కృషి చేశారని వక్తలు కొనియాడారు. సీతానగరం పిడబ్ల్యూడి వర్క్‌షాపులో ట్రేడ్స్‌మెన్ గ్రేడ్-2 (వెల్డర్)గా పని చేసి బుధవారం ఉద్యోగ విరమణ చేసిన రావులపల్లి వీరరాఘవయ్య అభినందన సభ నిర్వహించారు. పలువురు అధికారులు, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ వర్క్‌షాపులో అధికారులతో పాటు సహోద్యోగులు మన్ననలు కూడా రాఘవయ్య పొందారని అన్నారు. పనులు చక్కబెట్టడంలో రాఘవయ్య దిట్టన్నారు. పాలక పార్టీలు అవలంభిస్తున్న ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేక పోరాటాల్లో పాల్గొన్నారని చెప్పారు. ప్రస్తుతం ట్రేడ్ యూనియన్ రాష్ట్ర బాధ్యతలు చూస్తున్న రాఘవయ్య ఉద్యోగ విరమణ అనంతరం తన సమయాన్ని కార్మికులు, ప్రజల హక్కుల కోసం వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో జనరల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ భాను, డిఇఇ జాహ్నవి, జూనియర్ సూపరింటెండెంట్ ఎస్‌కె ముర్తుజ, విశ్రాంత సూపరింటెండెంట్ శ్యామ్‌ప్రసాద్, గుణకరరావు, ఇంజినీరింగ్ స్టాఫ్ జెఇలు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ప్రజాసంఘాల నాయకులు జె.శివ శంకరరావు, డి.వెంకటరెడ్డి, బి.వెంకటేశ్వర్లు, డి.శ్రీనివాస కుమారి, కె.కరుణాకరరావు, ఎస్.వెంకట్రావు, పి.గిరిజ, కె.ఉష, ఎం.శ్రీనివాసులు, పి.సత్యనారాయణ, ధనుంజయ్, టికె పాపిరెడ్డి పాల్గొన్నారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు జగన్ అధ్వర్యంలో కళాకారులు అభ్యుదయ గీతాలు ఆలపించారు.

పలు విభాగాలకు బాధ్యుల నియామకం

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంటర్నేషనల్ స్టూడెంట్ సెల్ (ఐఎస్‌సి) నూతన ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా ప్రొఫెసర్ పి.పద్మావతి (జువాలజీ), ఉమెన్స్ స్టడీస్ సెంటర్ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా డాక్టర్ ఈ.వి.పద్మజ (హిస్టరీ) నియమితులయ్యారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను ఇన్‌ఛార్జి వీసీ కె.గంగాధరరావు బుధవారం అందించారు. కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (సిఈ)గా ఆలపాటి శివప్రసాదరావు నియమిస్తూ రిజిస్ట్రార్ జి.సింహాచలం ఉత్తర్వులు జారీ చేశారు.

చిగురుపాటి శిరోమణికి అంతిమ వీడ్కోలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన గొప్ప వ్యక్తి చిగురుపాటి శిరోమణి (88) అని సిపిఎం తెనాలి ఏరియా కార్యదర్శి కె.బాబుప్రసాద్ అన్నారు. వయోభారం, అనారోగ్యంతో మంగళవారం మృతి చెందిన శిరోమణి భౌతికకాయానికి బాబుప్రసాద్, పలువురు నాయకులు బుధవారం నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయినిగా ఎంతో నిబద్ధతతో పనిచేసిన శిరోమణి ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారని కొనియాడారు. సిపిఎం ఉద్యమ భావాలను ఆకళింపు చేసుకున్నారని చెప్పారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు షేక్ హుస్సేన్‌వలి, బి.అగస్టిన్, కె.శ్రీమన్నారాయణ, జె.బాలరాజు, వై.స్టాలిన్, వై.బ్రహ్మేశ్వరరావు, జి.రవీంద్రరావు, ఎస్.సుబ్రహ్మణ్యం, ఎం.వెంకటేశ్వర్లు, జి.వెంకటసుబ్బయ్య, పి.జోనేష్, పి.నరశింహారావు, ఎం.శివకుమారి ఉన్నారు.



అంతిమయాత్రలో సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

ఆర్‌విఆర్ అధ్యాపకురాలికి డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు



ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ వసంతంశ్రీ ఝూన్సీ రాఘవకోట పద్మినివల్లికి ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. పద్మిని వల్లి 'యాన్ ఎఫిషియంట్ సెంటిమెంట్ బేస్డ్ ఎమోషన్ క్లాసిఫికేషన్ ఇన్ అన్‌స్ట్రక్చర్డ్ టెక్చువల్ డేటా యూజింగ్ హైబ్రిడ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్' అంశంపై పరిశోధన చేశారు. కళాశాల ప్రొఫెసర్, హెచ్‌ఒడి డాక్టర్ ఎంవిపి చంరదశేఖరరావు పర్యవేక్షణలో ఆమె పరిశోధన చేశారు. కళాశాలలో పిహెచ్‌డి కలిగిన స్టాఫ్ మొత్తం 144 మంది ఉన్నారని, కళాశాల పరిశోధనలను ప్రోత్సహిస్తుందని కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. పద్మిని వల్లికి సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు అభినందనలు తెలిపారు.

ఎఎన్‌ఎంలను కించపరిచే వ్యాఖ్యలు సరికాదు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ వైద్య, ఆరోగ్య సేవలలో భాగంగా ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు చేర్చి, నిరంతరం ప్రజల ఆరోగ్యం కాపాడటానికి ఎన్నో కార్యక్రమాలను బాధ్యతగా చేసే ఎఎన్‌ఎంలను ఆరోగ్య శాఖ అధికారులు కొంతమంది కించపరిచేట్టు మాట్లాడటం సరికాదని ఏపీ హెల్త్ అండ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) గుంటూరు జిల్లా కార్యవర్గం పేర్కొంది. ఈ మేరకు హంస జిల్లా అధ్యక్షులు బి.నాగవర్ధన్, కార్యదర్శి జీవన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.కిరణ్, జిల్లా ట్రెజరర్ వెంకటప్పయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. వైద్య సేవలో సోమవారం బీసీజీ వ్యాక్సిన్, మంగళవారం ఏఎంసీ సర్వీసెస్, బుధవారం చిన్న పిల్లల వ్యాక్సినేషన్, గురువారం బీసీసీ వ్యాక్సినేషన్, శుక్రవారం ఫ్రైడే డ్రై, శనివారం చిన్నపిల్లల వ్యాక్సినేషన్, వీటితోపాటు మలేరియా, డెంగీ ఎరాడికేషన్ కార్యక్రమాలు, డయేరియా, లెప్రసీ సర్వీసులు, ఈ నెల అంతా తల్లిపాల వారోత్సవాలు, కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు, ఆర్‌సహెచ్, అనుమోల్, యువిన్ ఆన్లైన్ సర్వీసులు వంటి ఊపిరి సలపలేని అనేక ప్రభుత్వ కార్యక్రమాలలో తలమునకలై ఉన్న ఎఎన్‌ఎంలు పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయటం సరికాదని పేర్కొన్నారు. వేరే శాఖకు చెందిన అధికారులు వారి కార్యక్రమాల్లో ఉపయోగించుకుంటూ ఎఎన్‌ఎం కేడర్‌ని కించపరిచే విధంగా టెలికాన్ఫరెన్స్‌లో తప్పించుకోవటానికి కుంటి సాకులు చెప్పొద్దంటూ అనవసరంగా, అవమానకరంగా ఎఎన్‌ఎంలు మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేయటం శోచనీయమని పేర్కొన్నారు. ఎంతో మానసిక ఒత్తిడితో, ఊపిరి సలపలేని పనిభారంతో కార్యక్రమాలన్నింటినీ విజయవంతం చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ ఉండే ఎఎన్‌ఎంలపై ఇతర శాఖల పనిభారాన్ని మోపకుండా చూడాలని కోరారు.

6న గద్దర్ ప్రథమ వర్థంతి సభ

ప్రజాశక్తి-గుంటూరు



ప్రజాయుద్ధనౌక గద్దర్ ప్రథమ వర్థంతి సభ ఈనెల 6న స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్నట్లు వివిధ ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు కరపత్రాలను స్థానిక ఏసీ కాలేజి ఎదురుగా ఉన్న అంబేద్కర్ భవన్ ప్రాంగణంలో బుధవారం ఆవిష్కరించారు. సభలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాసిం, కవి, సాహితీ విమర్శకులు ప్రొఫెసర్ జి.లక్ష్మీ నరసయ్య, వెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.శౌరయ్య, సీనియర్ న్యాయవాది వై.కె తదితరులు పాల్గొంటారని, ఉద్యమకారులు, ప్రజాస్వామ్యవాదులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కరపత్రం ఆవిష్కరణలో వివిధ సంఘాల నాయకులు పి.ప్రకాష్, ఎస్.సురేష్, ఎస్.మాల్యాద్రి, వి.నరసింహారావు, జి.ప్రభుదాసు, టి.నరసింహారావు పాల్గొన్నారు.



యోగాలో లేమల్లెపాడు యూపి స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

కెన్నెడీ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి యోగాప్రదర్శన పోటీల్లో లేమల్లెపాడు ఎంపియుపి స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారని హెచ్‌ఎం పసుపులేటి శ్రీధర్ తెలిపారు. 8-10 ఏళ్ల విభాగంలో పచ్చల బ్లెస్సీ ద్వితీయ స్థానం, వల్లాపురపు గౌతమి 4వ స్థానం, 10-12 ఏళ్ల విభాగంలో పచ్చల గాయత్రి తృతీయ స్థానం సాధించారన్నారు. గతేడాది నుండి పాఠశాలలో లికల్విన్ ఎంటర్‌ప్రైజెస్ హైదరాబాద్ వారి సౌజన్యంతో, యోగా మాస్టర్ ఎ.రాకేష్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయా విద్యార్థులను వట్టిచెరుకూరు ఎంఇఒ డి.నిర్మల అభినందించి, సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రవికృష్ణ, ప్రజాప్రతినిధులు పి.కృష్ణారావు, రామకృష్ణ, సిఆర్‌పి కల్యాణి పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుధ్య పనులు.. చీపురు పట్టిన ఎమ్మెల్యే

- పారిశుధ్య సమస్యల పరిష్కారానికి శ్రీకారం
- మురుగు రోడ్లపైకి చేరకుండా చూడాలని ఎమ్మెల్యే అరవిందబాబు ఆదేశం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వర్షాకాలం నేపథ్యంలో మురుగునీరు రోడ్డుపైకి రాకుండా, మురుగు కాల్వల్లో మురుగు నీరు సక్రమంగా పారేలా మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది బాధ్యతాయుతంగా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నరసరావుపేట పట్టణంలో చంద్రబాబు నాయుడు కాలనీ,ఐలా బజార్, నిమ్మతోట, పనసతోట, క్రిష్టియన్ పాలెంలో (1 నుండి 5 వ వార్డు) వరకు ఎమ్మెల్యే ప్రత్యేక పారిశుధ్య పనులను పార పట్టి మురుగు కాల్వలు,చీపురు పట్టి వీధులు, పిచికారీ యంత్రం ద్వారా యాంటీ లార్వా మందు పిచికారీ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అంటురోగాలు రాకుండా మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. శానిటేషన్ సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. పరిసరాల శుభ్రత ద్వారా ప్రజా రోగ్యం మెరుగుపడుతుందన్నారు.గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు దోమల పై దండయాత్ర పేరుతో వ్యాధుల నివారణకు ప్రత్యేక చొరవ చూపారని మళ్ళీ అదే ఒరవడి చూపుతున్నారన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక పథకాన్ని నిర్వీర్యం చేసిన ఫలితంగా వ్యాధులు వ్యాపించి,ప్రజలు అవస్థలు పడ్డారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సి రవిచంద్ర రెడ్డి,మున్సిపల్ ఇంజనీర్ బి కనకారావు,శానిటేషన్ ఇన్స్పెక్టర్ రామకోటయ్య,మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లు రాజు, నాయక్,వార్డు సచివాలయం సెక్రటరీలు టిడిపి నాయకులు కొట్టా కిరణ్,క్రాంతి పాల్గొన్నారు.





రొంపిచర్ల మండలంలో జల్ జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు అందిస్తామన్న హామీని అమలు చేసే దిశగా ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. రొంపిచర్ల మండలం వీరాటం,కొనకంచివారిపాలెం గ్రామాలలో జల్ జీవన్ మిషన్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పల్నాడు జిల్లాకు రూ.508 కోట్లు కేటాయిస్తే గత వైసిపి రాష్ట్ర వాటా ఇవ్వకుండా వైసిపి తాగునీటి సమస్యను జఠిలం చేసిందన్నారు. ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు చేసి, నీరందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శిలు జి.కోటేశ్వరరావు, ఎన్.రాము, టిడిపి రొంపిచర్ల మండల అధ్యక్ష కార్యదర్శిలు పి.జగ్గయ్య, పి.నాగిరెడ్డి, మాజీ ఎంపిపి ఎం.రామారావు, ఇంజనీర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మానవ అక్రమ రవాణా అరికట్టండి

ప్రజాశక్తి- అమరావతి

స్థానిక గుడ్‌షెఫర్డ్ కాన్వెంట్ లో అమరావతి, పెదకూరపాడు,క్రోసూరు మహిళలకు మానవ అక్రమ రవాణా నిర్మూలనపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లక్ష్మణ్ అధ్యక్షత వహించారు ముఖ్యఅతిది ఎస్సై నరసింహ మాట్లాడుతూ కొంతమంది స్వార్ధ పూరిత వ్యక్తుల మాటలు విని అదే నిజమనుకొని మానవ అక్రమ రవాణాకు గురవుతున్నారని అన్నారు. పల్లోటి విచారణ గురువులు ఫాదర్ వినోద్ మాట్లాడుతూ పిల్లలపై తల్లి దండ్రులు ప్రేమను చూపించాలని, అది కరువైతే పిల్లలు తల్లిదండ్రులకు దూరమవుతారని, కొన్ని సందర్భాల్లో అక్రమ రవాణాకు గురవుతారని అన్నారు. అంగన్వాడి సూపర్వైజర్ హిమాంబి, సిస్టర్ డియానా, గుడ్ షెఫర్డ్ డైరెక్టర్ సిస్టర్ విన్నారాసి మాట్లాడారు. పరిసర ప్రాంతాల్లో అక్రమ రవాణా జరిగితే పోలీస్ వారికి తెలియపరచాలన్నారు.



పాఠశాలకు 'స్నేహ హస్తాలు'చేయూత

ప్రజాశక్తి-పెదకూరపాడు

పెదకూరపాడు ఎంపీపీ హెచ్.డబ్ల్యూ. స్కూల్ కు స్నేహ హస్తాలు ఫౌండేషన్ డిజిటల్ టివి, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు, ఆట వస్తువులు బుధవారం బహూకరించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ నెల్లూరు రమేష్, పెదకూర పాడు గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు. డాక్టర్ నెల్లూరు రమేష్ మాటాడుతూ విద్యార్థులు కష్టపడి చదవి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. అనంతరం సర్పంచ్ రాజు, ఎంఇఒ సత్యనారాయణ మాట్లాడారు. నరసరావుపేట నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ నెల్లూరు రమేష్ రూ.15 వేల విలువ గల బీరువాను బహూకరించగా,పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు దర్శి నిర్మల డిజిటల్ టివి కోసం రూ.6 వేలు అందజేశారు. కార్యక్రమంలో స్నేహ హస్తాలు ఫౌండేషన్ కోఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు, ఉపాధ్యాయులు అనిత, న్యామతుల్లా, బెల్లం వెంకటప్పయ్య, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



దాశరధి కృష్ణమాచార్య శతజయంతి వేడుకలు

ప్రజాశక్తి-నాదెండ్ల

అభ్యుదయ కవి దాశరధి కృష్ణమాచార్యులు శత జయంతి వేడుకలు మంగళవారం గణపవరంలోని చుండి రంగనాయకులు డిగ్రీ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా దాశరధి కవిత్వంలో సామాజికత, శాస్త్రీయ దృక్పథం అనే అంశం పై ప్రముఖ సాహితీవేత్త డా.పివి సుబ్బారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చెన్నుపాటి చైతన్య, జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షులు డా.దార్ల బుజ్జిబాబు, తెలుగు అధ్యాపకురాలు సువార్త వాణ పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే భవిష్యత్‌లో రాణించేది

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకుని లక్ష్య సాధనకు కష్టపడి చదువుకుంటే గొప్ప వ్యక్తులుగా రాణిస్తారని లైఫ్ స్కిల్ కోచ్ ఊట్ల మాధవి అన్నారు. నరసరావుపేట పట్టణ పరిధిలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో బుధవారం మొదటి ఏడాది డిగ్రీ విద్యార్థులకు లైఫ్ స్కిల్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ శ్రమ, కృషి,పట్టుదల, క్రమశిక్షణతో చదివిన విద్యార్థులను విజయం వరిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ గురువులను, తల్లితండ్రులను,తోటి స్నేహితులను గౌరవించాలని నీతి నిజాయితీగా మెలగాలని సూచించారు. వివిధ కంపెనీలలో ఉపాధి అవకాశాలు దక్కించుకునేందుకు మొదటి సెమిస్టర్ నుండి ఎలా ప్రణాళికలు ఎలా రూపొందించుకోవాలో నైపుణ్య శిక్షణ ఎలా పెంపొందించుకోవాలో ఆమె విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అభివృద్ధి వైపు దూసుకెళ్తున్న భారతదేశంలో యువతదే భవిష్యత్ అన్నారు.తమ కళాశాలను లాభాపేక్షతో కాకుండా నాణ్యమైన విద్యను అందించడానికి స్థాపించామన్నారు. తమ కళాశాలకు ఇటీవల 10 ఏళ్ల అటానామనస్ హోదా లభించిందని దీంతో కళాశాల నిర్వహణలో మరింత బాధ్యత పెరిగిందన్నారు. కళాశాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య మాట్లాడుతూ తమ కళాశాల పూర్వ విద్యార్థులు బహుళజాతి కంపెనీలలో ప్రతినిధులుగా వ్యాపారవేత్తలుగా ఉన్నత స్థానంలో నిలవడం తమకెంతో గర్వంగా ఉందన్నారు.కార్యక్రమంలో టిపిఒ ఎం. బాలకోటేశ్వరరావు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ అభినందన సభ

ప్రజాశక్తి- వినుకొండ

స్థానిక శంగారవనం ప్రాథమిక పాఠశాల ఎల్ ఎఫ్ ఎల్ హెచ్.ఎం కొమ్మాలపాటి సోమశేఖర్ ఉద్యోగ విరమణ కార్యక్రమం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి సయ్యద్ జఫ్రుల్లా, లక్ష్మి ప్రసూన, ఈపూర్ విద్యాశాఖ అధికారి అన్నవరపు వీరాంజనేయులు , శ్రీనివాస నర్సింగ్ హెూమ్, వైద్యాధికారి అన్నవరపు వీరాంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ సోమశేఖర్ 34 సంవత్స రాల పాటు సుదీర్ఘ సేవలందించారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎన్. వెంకటేశ్వరరెడ్డి, కౌన్సిలర్ ఎం.జయరాజు, విద్యా కమిటీ చైర్మన్ కే ఏసు కుమారి, కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు నాగరాజు, బిఎ సత్తార్, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

'రాజధాని నిర్మాణ బాధ్యత కేంద్రానిదే'

ప్రజాశక్తి - కారంపూడి

ఏపీ రాజధాని నిర్మాణం బాధ్యత పూర్తిగా కేంద్రానిదేనని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ అన్నారు. బుధవారం ఆదినారాయణ కాలనీలోని ఆయన ఇంటి వద్ద జరిగిన నియోజకవర్గ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ కు కేటాయించిన నిధులపై స్పష్టత లేదన్నారు. విభజన హామీలను తక్షణమే అమలు చేయా లన్నారు.

పిటిజి ప్రిన్సిపాల్‌గా శామ్యూల్ జోబ్

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల మండలం విజయపురి సౌత్ పి టి జి (బాలురు) పాఠశాల ప్రిన్సిపాల్ గా పొన్నూరు. శ్యాముల్ జోబ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు, అనంతపురం జిల్లా గొల్లలా దొడ్డి ఎపిటిడబ్ల్యూ ఆర్ స్కూలు, కళాశాల నుంచి డిప్యూటేషన్ పై పిటిజి స్కూల్ కి వచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయనకి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు

సిఎంను కలిసిన కొమ్మాలపాటి శ్రీధర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పల్నాడు జిల్లాలో పలు అం శాలతో పాటు సత్వరమే పరిష్కరించాల్సిన సమస్యల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించారు. ఆయా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారని ఈ మేరకు టిడిపి పల్నాడు జిల్లా కార్యాలయం నుండి బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు.

'పెన్షన్‌దారులలో ఆనందం నింపిన ముఖ్యమంత్రి'

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్ నుండి 4 వేలు పెన్షన్ అందజేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట నిలబెట్టుకున్నారని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. నరసరావుపేట టిడిపి కార్యా లయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ పెన్షన్ లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం నింపిన ముఖ్యమంత్రి చంద్రబాబు, లబ్ధిదారుల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించారన్నారు. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల లోపు ఇంటి వద్దకు పింఛన్లు పంపిణీ కార్యక్రమం పల్నాడు జిల్లాలో ఎటువంటి జాప్యం లేకుండా చూడాలని టిడిపి నాయకులు భాగస్వామ్యం కావాలని శ్రీధర్ పిలుపునిచ్చారు.

ట్రైకోడెర్మా విరిడి కల్చర్ తయారీపై అవగాహన

ప్రజాశక్తి-నాదెండ్ల

మండలంలోని చందవరంలో బుధవారం రైతులకు ట్రైకోడెర్మా విరిడి యొక్క కల్చర్ తయారు చేసుకునే విధానాన్ని గురించి జిల్లా వనరుల కేంద్రం డిడిఎ ఎం.శివకుమారి వివరించారు. ఈ కల్చర్ తయారు చేసుకోవడానికి 90 కిలోల పశువుల ఎరువు, పది కిలోల నూనె తీసిన వేపపిండి, రెండు కిలోల ట్రైకోడెర్మా విరిడి కావాలి. ముందుగా ఒక పట్టాపై కొంత పశువుల ఎరువుని పోరా లాగా పరుచుకొని దానిపై కొంత వేప పిండిని పరుచుకొనవలెను దీనిపైన ఒక పొరలాగా ట్రైకోడెర్మా విరిడీని పరుచుకొని బాగా కలుపుకోవాలని, ఇలా కలుపుకున్న మిశ్రమాన్ని పైన గోనెపట్టతో కప్పుకొని కొంత నీరు చిలకరించాలి. దీని మొత్తాన్ని చెట్టు నీడ క్రింద 11 రోజుల పాటు నెమ్మ తగలకుండా ఉంచాలని ఇలా ఉంచిన మిశ్రమం 11 రోజులు తర్వాత ఒక ఎకరా చేనులో వేసుకొనినచో పంటలకు వేరు సంబంధిత తెగుళ్ళ రావని వివరించారు.

కుళాయి లేకున్నా పన్ను వసూళ్లు

తెనాలి మున్సిపల్ కౌన్సిల్‌లో కౌన్సిలర్లు - ప్రశాంతంగా ముగిసిన సమావేశం


మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల వాగ్వాదం

ప్రజాశక్తి-తెనాలి

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ప్రశాంతంగా ముగిసింది. చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన బుధవారం ఉదయం కౌన్సిల్ హాలులో సాధారణ సమావేశం నిర్వహించారు. ప్రధానంగా 37 అంశాలతో కూడిన అజెండాను సమావేశంలో చర్చకు పెట్టారు. ప్రారంభంలోనే 25వ వార్డు కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య మాట్లాడుతూ పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో కుళాయి కనెక్షన్లు ఇవ్వకుండానే పన్ను వసూలుకు డిమాండ్ నోటీసులు పంపడంతోపాటు బలవంతంగా వసూలుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కమిషనర్ బి.శేషన్న సమాధానమిస్తూ మున్సిపల్ నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తున్నట్టు బదులిచ్చారు. అదే సమయంలో 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ బిల్డింగ్ స్లాబ్ పెచ్చులూడుతోందని, మరమ్మతులు చేపట్టాలని కోరారు. టిడిపి ఫ్లోర్ లీడర్ పసుపులేటి త్రిమూర్తి మాట్లాడుతూ మునిసిపాలిటీ నిధులను గ్రామ పంచాయితీల అభివృద్ధికి ఉపయోగించే నిబంధన ఎక్కడిదని ప్రశ్నించారు. దీనిపై వైసిపి కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య జోక్యం చేసుకొని గత టిడిపి హయాంలో ఔటర్ రింగ్ రోడ్డు పేరిట పురపాలక సంఘ నిధులను పంచాయతీలకు ఖర్చు చేశారని గుర్తు చేశారు. ఈ క్రమంలో టిడిపి, వైసిపి కౌన్సిలర్ల మధ్య కొద్దిసేపు వాదనలు జరిగాయి. ఆరో వార్డు కౌన్సిలర్ కొర్రపాటి లక్ష్మి తన వార్డులో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని సమావేశం దృష్టికి తెచ్చారు. అజెండాలో 19వ అంశంలో రెండో వార్డు సభ్యులు అన్నాబత్తుని పద్మజ ఆరు నెలలుగా కౌన్సిల్ సమావేశాలకు హాజరు కావడం లేదని, వరుసగా మూడు నెలలు సమావేశాలకు గైర్హాజరైతే సభ్యత్వం రద్దు చేసేఅవకాశం ఉందన్న అంశం వాయిదా వేస్తూ సమావేశం నిర్ణయం తీసుకుంది. కంపోస్టు యార్డులో బయో మైనింగ్ కాంట్రాక్టు పనులు సక్రమంగా జరగని నేపథ్యంలో ఆ కాంట్రాక్టర్‌ను మార్చాలని సభ్యులు తీర్మానించారు.



సామూహిక పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని డోలాస్‌నగర్ గుడ్ షెపర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ సిస్టర్ కరుణాలయం (వీధి బాలికల వసతి గృహం)లో బుధవారం ఘనంగా పిల్లల పుట్టినరోజు వేడుకలను ఫాదర్ చిన్నప్ప బుధవారం ప్రారంభించారు. టిడిపి అధికార ప్రతినిధి ఆకుల జయసత్య, డిలైట్ దాభా నిర్వాహకులు పద్మజ, రాజ్యలక్ష్మి జ్యూయలర్స్ తిరుమలరావు పాల్గొని పిల్లలను ఆశీర్వదించారు. మంగళగిరి ప్రాంతంలో ఇటువంటి సంస్థ ఉండటం గొప్ప విషయమన్నారు. ఎందరో ఆడపిల్లలు ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారని చెప్పారు. మంత్రి లోకేష్‌తో మాట్లాడి పిల్లల అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా జె.పెరుమాళ్లరావు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సిస్టర్ లత, మాధవి, మనీష, ఎ.పోతురాజు పాల్గొన్నారు.

గౌడసంఘం అధ్యక్షులుగా రాంగోపాల్‌గౌడ్

ప్రజాశక్తి-తాడేపల్లి : రాష్ట్ర గౌడ సంఘం నూతన అధ్యక్షులుగా వాకా రాంగోపాల్‌గౌడ్ ఎన్నికయ్యారు. తాడేపల్లి పట్టణంలోని ఓ హోటల్‌లో చనుమోలు అశోక్ అధ్యక్షతన గౌడ సంఘం రాష్ట్ర సమావేశం నిర్వహించారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ హాజరై సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం ఉంటుందని హామీనిచ్చారు. రాంగోపాల్‌గౌడ్ న్యాయవాద వృత్తిలో ఉంటూనే పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వి.వెంకటాచలం, వి.రంగారావు, ఆంజనేయులు, కె.సుబ్బారావు, రామచంద్రరావు, సాంబశివరావు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

విజ్ఞాన్స్ లారాలో బీటెక్ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థుల జీవితాల్లో సంతోషం, బాధ, కష్టనష్టాలు, ఒడిదుడుకులు వంటివి అన్నీ ఉండాలని, అప్పుడే వారు ఉన్నతంగా ఎదుగుతారని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య చెప్పారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నుంచి బీటెక్ మొదటి సంవత్సరం తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లావు రత్తయ్య మాట్లాడుతూ ఈఏపీసెట్ కౌన్సిలింగ్‌లో తమ కళాశాలను ఎంచుకుని విద్యార్థులకు, చేర్పించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల్లో చదువు, అభివృద్ధి అనేది సంతోషంగా జరగాల్సిన ప్రక్రియని, నిరంతరం నేర్చుకోవాలనే తపన ఉండాలని అన్నారు. విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాల ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పంచసూత్రాలైన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, ప్లానింగ్-ట్రైనింగ్-కమ్యూనికేషన్ సిస్టమ్, కౌన్సిలింగ్ సిస్టమ్, సీఆర్‌టీ తరగతులు, బోధన పద్ధతి వల్లే తమ దగ్గర చదివిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నారని చెప్పారు. పిల్లల్ని తల్లిండ్రులు బాగా ప్రోత్సహించాలన్నారు. గత సంవత్సరం మొత్తం 603 మంది విద్యార్థులకు గాను 840 ఉద్యోగ అవకాశాలు లభించాయని వెల్లడించారు. ఈ సందర్భంగా ఐడియాథాన్, హ్యాకథాన్ కోడింగ్ కంటెస్ట్‌లలో అత్యధిక ప్రతిభ కనపరిచిన 26 మంది విద్యార్థులకు, కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పెట్, బెక్ కోర్సులలో ఉత్తీర్ణత సాధించిన 67 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల సమన్వయకర్త జి.శ్రీకూర్మనాథ్, లారా ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు.

డ్రెయిన్ల పూడికతీత వేగవంతం



ప్రజాశక్తి -మంగళగిరి


నగర పాలక సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకు పారిశుధ్య సిబ్బంది ప్రధాన డ్రెయిన్లలో పూడిక తీత పనులు చేపట్టారు. నిడమర్రు రోడ్డు, 30వ వార్డు, 19వ సచివాలయ పరిధిలో కాల్వల్లో వ్యర్థాలను పొక్లెయిన్ల ద్వారా తొలగించారు. ఈ పనులు మరింత వేగంగా జరుగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.

కెఎల్‌యులో ఫిన్‌టెక్ ల్యాబ్ ప్రారంభం


ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీనివాసన్

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఫిన్‌టెక్ టెక్నాలజీ ఆర్థిక రంగానికి మాత్రమే కాకుండా ప్రతి రంగానికి, వినియోగదారుల నుండి, ఆర్థిక సంస్థలతో పాటుగా కొత్తగా వ్యాపార రంగంలోకి ప్రవేశించే వారి నుండి రెగ్యులేటర్ల వరకు కొత్త ఉద్యోగ అవకాశాలను, ప్రాజెక్ట్ లను సృష్టిస్తోందని ఫిన్‌టెక్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సిఐ) బోర్డు సభ్యులు డాక్టర్ శ్రీనివాసన్ అన్నారు. కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన ఫిన్‌టెక్ ఇన్నోవేషన్ ల్యాబొరేటరీని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిన్‌టెక్ ప్రభుత్వాలకు అనేక అవకాశాలను అందిస్తుందన్నారు. ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఉపయోగపడుతుందన్నారు. పోటా పోటీగా ఆర్థిక సేవలను ప్రజలకు సులువుగా అందించడం ద్వారా బి.టెక్ పట్టభద్రులకు కొత్త ఉద్యోగాలను సృష్టిస్తోందని చెప్పారు. వర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీ కొత్తపుంతలు తొక్కుతున్న సందర్భాన్ని గుర్తించి తమ వర్శిటీలో కంప్యూటర్ సైన్స్ విద్యార్థులతో పాటు ఎంబిఎ విద్యార్ధులకు ఫిన్‌టెక్‌ను మెర్జ్ చేసి సులభతరంగా వారికి పాఠ్యాంశాన్ని అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది 500 మందికి పైగా విద్యార్థులు ఫిన్‌టెక్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అందించే వివిధ ఫిన్‌టెక్ కోర్సుల్లో ఇంటర్న్‌షిప్‌తో పాటు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు ప్రపంచ ఫిన్‌టెక్ కౌన్సిల్ యొక్క అత్యంత విశ్వసనీయమైన ప్రొఫెషనల్ సర్టిఫికెట్‌నును, బ్యాడ్జ్‌ను పొందారని వివరించారు. యుపిఎ చెల్లింపులు విజయవంతం కావడంతో ప్రపంచం ఇప్పుడు ఫిన్‌టెక్‌కు కనెక్ట్ అయిందన్నారు. కార్యక్రమంలో ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, స్కిల్ డెవలెప్‌మెంట్, స్టూడెంట్ ప్రోగ్రెషన్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, ప్లేస్‌మెంట్ డీన్ డాక్టర్ ఎన్ బివి.ప్రసాద్, కెఎల్ టిఫ్ సిఇఒ హరిబాబు పాల్గొన్నారు.


చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి మనోహర్

డ్వాక్రా మహిళలకు రూ.5.37 కోట్ల రుణాలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మహిళలు అన్నిరంగాలతో పాటు ఆర్థికంగానూ అభివృద్ధి చెందాలన్నదే కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మండలంలోని 38 డ్వాక్రా గ్రూపులకు రూ.5.37 కోట్లను బ్యాంకు లింగేజీతో రుణాలుగా మంజూరు చేయగా చెక్కులను మంత్రి మనోహర్ బుధవారం అందించారు. మహిళల స్వయంఉపాధికి కావాల్సిన ఆర్థిక వనరులను సమకూర్చడంతో పాటు నగదును నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వమిచ్చే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పెదరావూరు సర్పంచ్ కె.రమాదేవి, ఎంపిడిఒ శిల్ప, ఎపిఎం జయశ్రీ పాల్గొన్నారు.

తెనాలి డీఎస్పీగా జనార్ధనరావు



ప్రజాశక్తి-తెనాలి

తెనాలి సబ్ డివిజినల్ పోలీస్ అధికారిగా బి.జనార్ధనరావు బదిలీపై రానున్నారు. రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు బుధవారం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం విజయవాడ ట్రాఫిక్ డివిజన్ 1లో ఎసిపిగా పనిచేస్తున్న బి.జనార్ధనరావును తెనాలి డీఎస్పీగా బదిలీ చేశారు. ఇప్పటి వరకూ ఆ స్థానంలో పనిచేసిన ఎం.రమేష్‌ను పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు.ఎన్నికలకు ముందు తెనాలి డీఎస్పీగా జనరార్ధనరావు పని చేశారు.

వృథాగా పోతున్న తాగునీరు



ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలోని కన్నమ్మ హోటల్ సెంటర్‌లో ఇటీవల సిమెంటు రోడ్డు తవ్వి పైపులైను మరమ్మతులు చేశారు. మరలా పైపులు పగిలిపోయి నీరు బయటకు తన్నుకొచ్చి వృథా అవుతోంది. ప్రకాష్‌నగర్‌లోని సిపిఎం కార్యాలయం బజారులోనూ ఇదే పరిస్థితి. లీకేజీలను అరికట్టాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు కోరారు.

పద్మశాలి బజారులో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-తాడేపల్లి

సమస్య చెప్పిన వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేసిన ఎమ్‌టిఎంసి సిబ్బందికి స్థానికులు అభినందనలు తెలిపారు. పద్మశాలీ బజారులో ఇటీవల చెత్త తరలింపు విషయంలో గుడి వెనుక కొన్ని ఇళ్లకు సిబ్బంది వెళ్లడంలేదని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ ప్రాంతంలో కుక్కలు అధికంగా ఉండటంతో తాము వెళ్లలేమని అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది అధికారులకు సమాచారం ఇచ్చారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న వారిని మార్పుచేసి మరొకరికి అవకాశం కల్పించడంతో గుడి వెనుక ప్రాంతాలకూ వెళ్లి ఇళ్ల నుంచి చెత్త సేకరించడంతో సమస్య పరిష్కారమైంది.

ఉపాధి కార్యాలయంలో రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గుజ్జనగుండ్లలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రఘు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లాలోని యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫెయిర్‌డీల్ క్యాపిటల్, హెచ్1హెచ్‌ఆర్ సొల్యూషన్స్, క్యాప్‌స్టోన్ సర్వీసెస్, ఫ్లిప్‌కార్ట్ కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటాయని, టెన్త్, ఐటిఐ, ఇంటర్, డిగ్రీ, బి.టెక్, ఎంబిఎ, పిజి వరకూ చదివిన, 1-35 ఏళ్ల వారు బయోడేటా, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోతో నేరుగా ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకూ జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు 9866822697, 8790790762 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.


హ్యాక్‌ఫెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్

హ్యాక్ ఫెస్ట్‌లో చలపతి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజి విద్యార్థులు సాప్ సంస్థ, పిఎస్‌జి కళాశాల సంయుక్తంగా కోయంబత్తూరులో నిర్వహించిన హ్యాక్‌ఫెస్ట్‌లో ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు వంద టీములు పాల్గొనగా చివరి రౌండ్‌లో తృతీయ సంవత్సరం విద్యార్థులు 11వ రౌండ్‌టో నిలిచినట్లు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఇలాంటి అవకాశాన్ని వినియోగించుకొని రాబోయే కాలంలో మరింత రాణించాలని ఆకాంక్షించారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను వివిధ విభాగాల అధ్యాపకులు అభినందించారు.



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

కళ్లం కాలేజీలో 'అమ్మ పేరుతో ఒక మొక్క'

ప్రజాశక్తి-గుంటూరు

కళ్లం ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి మాట్లాడుతూ చెట్టు మనకు స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారం అందిస్తుందని, నువ్వు చెట్టును కాపాడితే అది నిన్ను కాపాడుతుందని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బి రెడ్డి మాట్లాడుతూ తల్లి పేరు మీద ప్రతి ఒక్కరూ ఒక చెట్టు నాటాలని కోరారు. అనంతరం వంద మొక్కలను కళాశాల ఆవరణలో నాటారు. కార్యక్రమంలో సివిల్ హెడ్ ఎం.సతీష్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ పున్నారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో టిడిపి నాయకురాలు హల్‌చల్

ప్రజాశక్తి - అమరావతి



మండలంలోని చావుపాడు అంగన్వాడీ కేంద్రంలో గత సోమవారం విధుల్లో ఉన్న అంగన్వాడీ ఆయాపై గ్రామానికి చెందిన టిడిపి నాయకురాలు దాడికి ప్రయత్నించడంతోపాటు కేంద్రంలో భయానక వాతావరణం సృష్టించడాన్ని ఖండిస్తున్నట్లు సిఐటియు మండల కార్యదర్శి బి.సూరిబాబు చెప్పారు. అంగన్వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్న సమయంలో పలువురు టిడిపికి చెందినవారు అక్కడికి వెళ్లి గలాటా చేశారని, వారి తీరుతో కేంద్రంలోని పిల్లలూ భయాందోళనకు గురయ్యారని చెప్పారు. ఎనిమిదేళ్ళుగా ఆయాగా విధులు నిర్వహిస్తున్న మహిళను రాజీనామా చేయాలంటూ బెదిరించారని తెలిపారు. మండలంలోని ఎండ్రాయి, చావుపాడు, వైకుంఠపురం గ్రామాల్లోనూ యానిమేటర్లను టిడిపి నాయకులు బెదిరిస్తున్నారని, సిసిలతో మాట్లాడించి రాజీనామాలకు ఒత్తిళ్లు తెస్తున్నారని చెప్పారు. ఈ చర్యలకు సత్వరమే స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు.

నమ్మకం కలిగిస్తేనేగా ఆస్పత్రికి వచ్చేది..

- రాత్రివేళల్లోనూ ఇద్దరు నర్సులు అందుబాటులో ఉండండి
- చిన్న వానకే 30 మంది విద్యార్థులు బడికి రాలేదా?
- ప్రభుత్వాస్పత్రి, పాఠశాల, అంగన్వాడీ కేంద్రంలో కలెక్టర్ తనిఖీ


మందులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మంచి వైద్యం అందిస్తారనే భరోసా కల్పిస్తేనే రోగులు ఆస్పత్రికి ఎక్కువగా వస్తారని, ఆ నమ్మకాన్ని ప్రజల్లో కల్పించాలని వైద్యులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులోని కమ్యూనిటి హెల్త్ సెంటర్ (సిహెచ్‌సి)ని కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. ఆస్పత్రితోపాటు ప్రాంగణాన్నీ పరిశుభ్రంగా ఉంచాలని, రాత్రివేళల్లో నర్సు, హెడ్‌నర్సు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పలు విభాగాలతోపాటు రికార్డులను పరిశీలించారు. మందుల వివరాలన్నీ ఈ-ఔషధిలో నమోదు చేయాలన్నారు. ఆస్పత్రి పరిధిలోని గర్భిణులను గుర్తించి ప్రతినెలా పరీక్షలు చేయాలని, సుఖ ప్రసవానికి డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఆస్పత్రిలోని రోగులతో మాట్లాడి సదుపాయాలపై వారి అభిప్రాయం తెలుసుకున్నారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ చాలా కాలంగా మరమ్మతులకు గురైందని, గైనకాలజిస్ట్ డాక్టర్ అందుబాటులో ఉన్నా సరైన వైద్యసేవలు అందించలేకపోతున్నారని తెలిసి జిల్లా వైద్యారోగ్య శాఖాధికారితో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడారు. గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సి)లో నిరుపయోగంగా ఉన్న అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్‌ను ప్రత్తిపాడు సిహెచ్‌సికి అందించే అవకాశాన్ని పరిశీలించాలన్నారు. నిర్మాణంలో ఉన్న అత్యవసర విభాగం, ఓపీ విభాగాలను పరిశీలించగా ఆరు నెలల్లో పనులు పూర్తి చేస్తామని ఇంజినీర్ తెలిపారు. ఆస్పత్రి బయటున్న జనరేటర్‌కు షెడ్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.

విద్యార్థులు ఎందుకు తగ్గుతున్నారు?

అనంతరం స్థానిక జెడ్‌పి పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థుల సంఖ్య క్రమేణ ఎందుకు తగ్గుతోందని హెచ్‌ఎం శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. బుధవారం 50 మంది విద్యార్థులు రాకపోవడానికి వర్షం కారణమనే హెచ్‌ఎం సమాధానంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 30 మంది ఉపాధ్యాయులుండి 350 మంది విద్యార్థులను కంట్రోల్ చేయలేకపోతున్నారా? అని నిలదీశారు. ఉపాధ్యాయులతోపాటు సచివాలయ సిబ్బందీ కలిసి విద్యార్థుల సంఖ్యను పెంచాలని, విద్యార్థులంతా పాఠశాలకు వచ్చేలా రోజుకు రెండు గంటల పాటు ప్రత్యేక కృషి చేయాలని సూచించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం పక్కనున్న అంగన్వాడీ కేంద్రాన్ని తనికీ చేశారు. ఏడుగురు పిల్లలే ఉండడంపై టీచర్‌ను ప్రశ్నించారు. తనిఖీల్లో ఆర్‌డిఒ పి.శ్రీకర్, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ సుబ్రహ్మణ్యరాజు, మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగార్జున, తహశీల్దార్ కె.రవిబాబు, ఎంపిడిఒ దుర్గాప్రసాద్, సిహెచ్‌సి డాక్టర్లు అఖిల్, నాగార్జున, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పింఛను కోసం వృద్ధురాలి రోదన

అంగన్వాడీ కేంద్రం పరిశీలన సందర్భంలో సచివాలయం-2 పరిధిలోని ఓ వృద్ధురాలు కలెక్టర్‌ను కలిసి తనకు పింఛను రావడం లేదని విలపించారు. కలెక్టర్ స్పందిస్తూ మార్చిలో ధరఖాస్తు చేస్తే డిసెంబర్‌కు వస్తుందని, ప్రస్తుతం దరఖాస్తుకు సైట్ రావడం లేదని బదులిచ్చారు. సైట్ వచ్చినప్పుడు దరఖాస్తు చేసుకోవాలని సూచించి ఆమె వివరాలను పరిశీలించాలని ఎంపిడిఒకు కలెక్టర్ సూచించారు.



చేబ్రోలు మండలంలో జెసి పరిశీలన

ప్రజాశక్తి-చేబ్రోలు

మండల కేంద్రమైన చేబ్రోలు, మండలంలోని నారాకోడూరు జెడ్‌పి పాఠశాలలను జెసి ఎ.భార్గవ్‌తేజ బుధవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం మెనూ అమలు, నాణ్యతపై విద్యార్థుల అభిప్రాయాలు అడిగారు. కొంతమంది రాగిజావ తీసుకోవడానికి ఆసక్తి చూపటం లేదని ఉపాధ్యాయులు చెప్పగా దీనిపై విద్యార్థులను జెసి అడిగారు. రాగిజావ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం రేషన్ బియ్యం సరఫరా, పారిశుధ్య నిర్వహణపై ఎంపిడిఒ జ్యోతితో మాట్లాడారు. ఇదిలా ఉండగా వేజండ్లలో ప్రత్యేక పారిశుధ్య పనులపై ప్రత్యేకాధికారి ఎ.లక్ష్మికుమారి, డిఎల్‌డిఒ పద్మావతి పరిశీలించారు. స్థానిక జెడ్‌పి పాఠశాలనూ సందర్శించి 9, 10 వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ఇఒపిఆర్‌డి జి.శ్రీనివాసరావు, డిటి ప్రణతి, సివిల్ సప్లయీస్ డిటి భువనేశ్వరి పాల్గొన్నారు.

190 రోజులైనా పరిహారంలో ప్రభుత్వం తాత్సారం

ప్రజాశక్తి-తెనాలి : అగ్ని ప్రమాదం జరిగి 190 రోజులు గడుస్తున్నా రైతులకు పరిహారం చెల్లింపులో ప్రభుత్వం తాత్సారం చేస్తోందని రైతు సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు వేములపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజిలో జనవరి 19న అగ్నిప్రమాదం జరిగి పెద్దఎత్తున పసుపు రైతులు నష్టపోయిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం అంగీకరించిన ప్రకారం పరిహారం తక్షణమే చెల్లించాలని కోరుతూ సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాధిత రైతులతో కలిసి నాయకులు బుధవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్వింటాళ్‌కు రూ.7వేల చొప్పున చెల్లించేందుకు మంత్రి నారా లోకేష్ చొరవ చూపారని, ఈ ఒప్పందం జరిగి మూడు వారాలు కావస్తున్నా పురోగతిపై రైతులకు సమాచారం లేదని అన్నారు. సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌ను కలిసేందుకు వచ్చామని, ఆయన అందుబాటులో లేరన్నారు. పెట్టుబడులకు, చేసిన అప్పులతో రైతులు సతమతమవుతున్న నేపథ్యంలో తక్షణమే చెల్లించాలని కోరారు. రైతు సంఘం గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన అనేక మంది రైతులు నష్టపోయారని, ఇన్సూరెన్స్‌తో పనిలేకుండా పరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బిఎల్‌కె ప్రసాదరావు, కె.రామస్వామి, ఎల్.భాస్కరరెడ్డి, వి.శ్రీకాంత్, ఎన్.సురేంద్ర, చందు సత్యనారాయణ, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

మూసేసిన పాఠశాల పున:ప్రారంభం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - పొన్నూరు

స్థానిక 8వ వార్డు క్యాబిన్ పేటలో 2022లో గత ప్రభుత్వం మూసివేసిన ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలను ఎమ్మెల్యే డి.నరేంద్రకుమార్ బుధవారం పున:ప్రారంభించారు. ఈ ఏడాది మార్చి 29న 'పాఠశాల కోసం ప్రయత్నం' పేరుతో క్యాబిన్‌పేటలో ఎలిమెంటరీ స్కూల్‌పై కథనం ప్రచురితమైంది. దీనిపై నరేంద్ర కుమార్ స్పందించి ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభ సభకు ఎంఇఒ-2 కె.శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఈ స్కూల్‌ను విలీనం చేయటం వల్ల పిల్లల్ని దూరం ప్రాంతాలకు పంపడంతో వారు ఇబ్బంది పడ్డారన్నారు. పలువురు రోడ్డు ప్రమాదాలకూ గురైనట్లు తల్లిదండ్రులు తన దృష్టికి తెచ్చారని చెప్పారు. ప్రస్తుతం పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను నిమించామని, త్వరలో పాఠశాలకు ఇతర సదుపాయాలనూ కల్పిస్తామని చెప్పారు. మాజీ కౌన్సిలర్ నీలా జ్ఞానసుందరరావు మాట్లాడుతూ మున్సిపాలిటీ ద్వారా కూడా సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఎంఇఒ-1 ఎవిహెచ్ ప్రసాద్, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.


పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



వాయనాడ్ మృతులకు సంతాపంగా ర్యాలీ

ప్రజాశక్తి - పొన్నూరు

కేరళ రాష్ట్రం వాయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడి వందలాదిమంది మృత్యువాత పడినందుకు సంతాపంగా పట్టణంలోని సెయింట్ థామస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు బుధవారం ప్రదర్శన చేశారు. మృతుల కుటుంబాలకు తమ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు అందరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు.

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా 2024-25 విద్యా సంవత్సరానికి పదవ తరగతి, ఇంటర్‌లో అడ్మిషన్ కోసం ఆగస్టు 28వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20వ తేదీలోగా ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. కాగా సెప్టెంబర్ 4వ తేదీలోగా ఆలస్య రుసుం రూ.200తో ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. పదో తరగతిలో చేరటానికి 14 ఏళ్లు నిండిన వారు, ఇంటర్‌లో చేరటానికి పదో తరగతి ఉత్తీర్ణులై, 15 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. www.apopen-school.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.